

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 32 | హైదరాబాద్ | ఆదివారం | 19-07-2026 | పేజీలు: 08




02

## అంతరిక్షంలోకి దూసుకెళ్లిన 'విక్రమ్1'

భారత ప్రైవేట్ స్పేస్ రంగంలో కొత్త అధ్యాయం
శ్రీహరికోట నుంచి స్కైరూట్ తొలి
ఆర్బిటల్ రాకెట్ విజయవంతమైన ప్రయోగం
35 నిమిషాల ఆలస్యానంతరం నింగిలోకి..
నిర్ణీత కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాలు
ప్రధాని మోదీ చేతిరాత
'వందేమాతరం'తో పాటు ప్రత్యేక పేలోడ్లు
'మిషన్ ఆగమన్'తో భారత ప్రైవేట్
అంతరిక్ష రంగానికి చారిత్రక ముందడుగు

## ఆయిల్‌పామ్ రైతుల కోసం దక్షిణాది ఏకమవ్వాలి

దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ
మంత్రులకు తుమ్మల నాగేశ్వరరావు లేఖ
ప్రధానిని కలిసి రైతుల
సమస్యలు వివరించాలని ప్రతిపాదన
ఆయిల్‌పామ్‌కు కనీస హామీ ధర
రూ.25 వేలుగా నిర్ణయించాలని విజ్ఞప్తి
దిగుమతి సుంకాన్ని 44 శాతానికి
పునరుద్ధరించాలని కేంద్రానికి డిమాండ్

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై సంయుక్తంగా ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో దక్షిణాది రాష్ట్రాల మిగతా 2లో..



## బుల్లెట్ ట్రైన్ భూసేకరణపై ఉద్రిక్తత

హైడ్రా అధికారులను అడ్డుకున్న రైతులు
తోపులాటలో ఓ రైతు అస్వస్థత
650 ఎకరాలకు కంచె వేసేందుకు
వెళ్లిన రెవెన్యూ, హైడ్రా అధికారులకు నిరసన
ఆర్డీవోతో వాగ్వాదం.. నినాదాలతో
ఆందోళనకు దిగిన స్థానికులు
పోలీసులతో తోపులాటలో రైతు నరసింహ
స్పృహతప్పి పడిపోవడం
సమస్య పరిష్కరించాకే కంచె
వేయాలని రైతుల డిమాండ్



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం చేపట్టిన మిగతా 2లో..

## హర్మ్యూజ్‌లో పేలిన చమురు ట్యాంకర్లు

ఐఆర్‌జీసీ సంచలన ప్రకటన..
'అది అవాస్తవం' అంటూ ఖండించిన అమెరికా
హర్మ్యూజ్ జలసంధిలో రెండు
ట్యాంకర్లు పేలిపోయాయని ఇరాన్
రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటన
అమెరికా నిఘా సంస్థలే ఆ మార్గంలో
పంపాయని ఐఆర్‌జీసీ ఆరోపణ
ఈ వాదనను పూర్తిగా
ఖండించిన అమెరికా సెంట్‌కామ్
యుద్ధం మరింత ఉధృతం..
బాబ్ అల్-మాండెబ్‌పైనా ఉద్రిక్తతలు



02

### కల్వకుంట్ల కుటుంబం నిజాంను మించిన

# ధనవంతులు

ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతివనానికి భూమిపూజ
అందెశ్రీ ఒక ఆత్మబంధువు అని కొనియాడిన సీఎం రేవంత్ రెడ్డి
కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడి
తాను సీఎంగా ఉండగా బీఆర్ఎస్ అధికారంలోకి రాదని స్పష్టం

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

కేసీఆర్ కుటుంబం వందలాది ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుందని, వారు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎదిగారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత అందెశ్రీ గౌరవార్థం ఘట్‌కేసర్‌లో నిర్మించనున్న 'అందెశ్రీ స్మృతివనం' పనులకు ముఖ్యమంత్రి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

"దొరల గడీల ముందు తలవంచను" అని చాటిచెప్పిన ధైర్యశాలి అందెశ్రీ అని ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రజల కవిగా, గాయకుడిగా అందెశ్రీ అందించిన సేవలను స్మరించుకుంటూ, మిగతా 2లో..



# కాంగ్రెస్ కు డెత్ డిక్లరేషన్

యువ గళాలు గర్జిస్తే కుర్చీలు కూలిపోతాయి
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు
యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని ఆరోపణ
70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
ఉద్యోగాల కంటే రాహుల్‌గాంధీ రాజకీయాలపైనే రేవంత్ దృష్టి అని వ్యాఖ్య

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

యువత గళం బలంగా వినిపిస్తే అధికార కుర్చీలు కూడా కూలిపోతాయని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఇప్పటివరకు ఒక లెక్క అయితే.. ఇకపై మరో లెక్క ఉంటుందని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన యూత్ డిక్లరేషన్ యువతను మోసం చేసేందుకేనని ఆరోపించిన కేటీఆర్.. ఆ పార్టీకి యువత డెత్ డిక్లరేషన్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వేలాది మంది విద్యార్థుల ప్రాణాలు పోవడానికి కాంగ్రెస్ బాధ్యత వహించాలని ఆరోపించారు. యువతతో రాజకీయాలు చేస్తే ఆ ప్రభావం తరాలపాటు ఉంటుందని వ్యాఖ్యానించారు. యూత్ డిక్లరేషన్‌లో మిగతా 2లో..



## స్కైరూట్ బృందానికి ప్రధాని మోదీ అభినందనలు

### ఇది తొలి అడుగు మాత్రమే..

ఇంకా గొప్ప విజయాలు సాధించాలి' అంటూ ప్రశంసలు
విక్రమ్1 విజయవంతమైన ప్రయోగం అనంతరం
స్కైరూట్ వ్యవస్థాపకులకు ఫోన్ చేసిన ప్రధాని
పవన్‌కుమార్ చందన, నాగ్ భరత్‌తో మాట్లాడిన మోదీ
నిర్ణయించిన లక్ష్యాలను ముందుగానే సాధించారని ప్రశంస
భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి
విక్రమ్1 చారిత్రక మైలురాయిగా అభివర్ణన

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచిన స్కైరూట్ ఏరోస్పేస్ తొలి ఆర్బిటల్ క్లాస్ రాకెట్ *'విక్రమ్ 1'* విజయవంతమైన ప్రయోగంపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతంగా పూర్తైన అనంతరం స్కైరూట్ వ్యవస్థాపకులు పవన్‌కుమార్ చందన, నాగ్ భరత్‌కు ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్లు ప్రధాని తెలిపారు. "మీరు అనుకున్న సమయానికంటే ముందుగానే మీ లక్ష్యాలను సాధించారు. ఈ ప్రయోగాన్ని నేను వీక్షించాను. ఇందులో భాగమైన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు, కృతజ్ఞతలు. ఈ మిషన్ మిగతా 2లో..



## కల్తీపై ఉక్కుపాదం

ఆహార, ఔషధ కల్తీల నిరోధానికి కఠిన చట్టం
తెలంగాణకు ప్రత్యేక TGFADCA చట్టం రూపకల్పన
విదేశీ చట్టాల అధ్యయనానికి అధికారులకు ఆదేశం
బిల్లుపై శాసనసభలో సమగ్ర చర్చ నిర్వహించనున్న ప్రభుత్వం
ప్రజల అభిప్రాయాలు తీసుకుని చట్టానికి తుది రూపం
విజిల్‌బ్లోయర్ల వ్యవస్థ, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు
సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక విధానం
క్యూర్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు
కల్తీపై కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధం
ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్న సీఎం

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

ఆహార పదార్థాలు, ఔషధాల్లో పెరుగుతున్న కల్తీని పూర్తిగా అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణకు ప్రత్యేకంగా *తెలంగాణ ఫుడ్ అడల్టరేషన్ అండ్ డ్రగ్ కంట్రోల్ యాక్ట్ (TGFADCA)* రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ చట్టం రూపకల్పన, అమలు విధానాలపై ఎంసీహెచ్‌ఆర్డీలో శనివారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం మిగతా 2లో..



## పేపర్ లీకేజీలతో ఎన్నో కుటుంబాల్లో విషాదం

విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చాల్సిందే
కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ డిమాండ్
ప్రశ్నాపత్రాల లీకేజీలపై
రాహుల్ తీవ్ర ఆవేదన
దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థ
పునర్నిర్మాణానికి రాహుల్ పిలుపు
నీట్ వివాదంతో ప్రాణాలు
కోల్పోయిన విద్యార్థిని రియా
'ఎక్స్' పోస్టులో బాధితురాలి
తండ్రి బాధ ప్రస్తావన
రాజేశ్ ఆవేదన ప్రతి ఒక్కరినీ
కలచివేస్తోందన్న రాహుల్
విద్యార్థులకు న్యాయం జరిగే
వరకు పోరాటం చేస్తామని వెల్లడి

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

దేశంలో వరుసగా జరుగుతున్న పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీల ఉదంతాలపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అత్యంత తీవ్రంగా స్పందించారు. ఈ దారుణమైన లీకేజీల కారణంగా దేశంలోని మిగతా 2లో..



# కాంగ్రెస్ కు డెత్ డిక్లరేషన్

మొదటిపేజీ తరువాయి

రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించిన కేటీఆర్.. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి బదులుగా అవినీతి, అక్రమాలే పెరిగాయని విమర్శించారు. తెలంగాణలో ఉద్యోగ నోటిఫికేషన్లు కనిపించడం లేదని, 'లూటీ నోటిఫికేషన్లే' కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకుల రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నోటిఫికేషన్లతో సహా నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని కేటీఆర్ సవాల్ విసిరారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, ఆయనకు పదవి ఇచ్చింది తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకా, లేక రాహుల్ గాంధీకి రాజకీయ ప్రయోజనం చేకూర్చేందుకా అని ప్రశ్నించారు.

తెలుగు, ఆంగ్ల సంవత్సరాలు మారుతున్నా ఉద్యోగాల వార్షిక ప్రణాళిక మాత్రం మారడం లేదని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో ప్రకటించిన ఉద్యోగాల ప్రణాళిక ఇప్పుడు విలువలేని కాగితంగా మారిందని ఆరోపించారు. యువత తమ హక్కుల కోసం పోరాడేందుకు ముందుకు వచ్చిందని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చకపోతే తీవ్ర రాజకీయ పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



## బుల్లెట్ ట్రైన్ భూసేకరణపై ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

భూసేకరణ వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రాజెక్టు కోసం సేకరించిన సుమారు 650 ఎకరాల భూమికి కంచె ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు, హైడ్రా సిబ్బంది పోలీసు బందోబస్తుతో శనివారం అక్కడికి చేరుకోగా, స్థానిక రైతులు, భూయజమానులు వారిని అడ్డుకున్నారు.

భూములకు కంచె వేయొద్దంటూ రైతులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీధర్‌తో స్థానికులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. తమ సమస్యలు పరిష్కరించకుండా, భూ వివాదాలను పరిష్కరించకుండా కంచె వేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రైతులను వెనక్కి పంపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో రైతు నరసింహ అస్వస్థతకు గురై స్పృహ తప్పి కుప్పకూలారు. వెంటనే అధికారులు ఆయనను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా, తోటి రైతులు అడ్డుకుని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు, భూసేకరణకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కంచె వేయడానికి అనుమతించబోమని రైతులు స్పష్టం చేశారు. భూములకు తగిన పరిహారం, ఇతర హామీలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఘటన నేపథ్యంలో బహదూర్‌గూడలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. రైతులతో చర్చలు జరిపి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ఆయిల్‌పామ్ రైతుల కోసం దక్షిణాది ఏకమవ్వాలి

మొదటిపేజీ తరువాయి

వ్యవసాయ మంత్రులకు ఆయన లేఖ రాశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి ఆయిల్‌పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించాలని ప్రతిపాదించారు.

ఆయిల్‌పామ్ పంటకు కనీస హామీ ధరను టన్నుకు రూ.25 వేలుగా నిర్ణయించాలని తుమ్మల డిమాండ్ చేశారు. ఒకవేళ అది సాధ్యం కాకపోతే ముడి పామ్ నూనెపై దిగుమతి సుంకాన్ని మళ్లీ 44 శాతానికి పెంచాలని కేంద్రాన్ని కోరారు.

దిగుమతి సుంకాలను తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్‌పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మంత్రి పేర్కొన్నారు. ధరలు పడిపోవడంతో రైతులకు గిట్టుబాటు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

దేశంలో సాగవుతున్న ఆయిల్‌పామ్ పంటలో సుమారు 75 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదేనని తుమ్మల గుర్తు చేశారు. రైతులకు స్థిరమైన ఆదాయం అందాలంటే కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని తగిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వంటనూనెల ఉత్పత్తిలో దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లాలంటే ముందుగా ఆయిల్‌పామ్ రైతులను రక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి పనిచేసి రైతుల ప్రయోజనాల కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## కల్తీపై ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి

పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

సమీక్ష సందర్భంగా రాష్ట్రంలో ఆహార పదార్థాల నుంచి ఔషధాల వరకు దాదాపు ప్రతి రంగంలో కల్తీ పెరుగుతున్న తీరుపై సీఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు నిత్యం వినియోగించే పాలు, పెరుగు, నెయ్యి, వంటనూనెలు, మసాలా దినుసులు, తేనె, మిఠాయిలు, కూరగాయలు, పండ్లు వంటి అనేక వస్తువుల్లో కల్తీ జరుగుతోందని, ఇది ప్రజల ఆరోగ్యానికి పెద్ద ముప్పుగా మారిందన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువ రోజులు తాజాగా కనిపించేలా, పండ్లు త్వరగా మగ్గేలా రసాయనాలను విచ్చలవిడిగా ఉపయోగించడం వల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు.

పంటల ఉత్పత్తిలో కూడా ఎరువులు, పురుగు మందుల అధిక వినియోగం వల్ల రసాయన అవశేషాలు మిగులుతున్నాయని సీఎం చెప్పారు. ఈ కారణంగా కొన్ని వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి విదేశీ దేశాలు నిరాకరిస్తున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని గుర్తు చేశారు. వ్యవసాయ రంగానికి, రైతుల ఆదాయానికి కూడా ఇది ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. అందువల్ల కేవలం వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణ కోసమే కాకుండా వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత పెంపు కోసం కూడా కఠిన చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు.

మార్కెట్లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో అనేక వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తున్నప్పటికీ అవి నిజంగా సేంద్రియ పద్ధతుల్లోనే తయారయ్యాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించే బలమైన వ్యవస్థ ప్రస్తుతం లేదని సీఎం పేర్కొన్నారు. ఈ పరిస్థితి వినియోగదారులను మోసగించేలా ఉందని, అందువల్ల సేంద్రియ ఉత్పత్తులకు విశ్వసనీయ ధృవీకరణ వ్యవస్థను కూడా చట్టంలో భాగం చేయాలని అధికారులకు సూచించారు.

తెలంగాణకు తీసుకురానున్న చట్టం దేశంలోనే ఆదర్శంగా ఉండేలా రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం ఆహార, ఔషధ కల్తీల నియంత్రణలో విజయవంతమైన వ్యవస్థలు అమలవుతున్న దేశాలను అధికారులు సందర్శించాలని సూచించారు. అక్కడి చట్టాలు, అమలు విధానం, శిక్షలు, తనిఖీ వ్యవస్థలు, ప్రయోగశాలల పనితీరు, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా తెలంగాణకు అనువైన సమగ్ర చట్టాన్ని రూపొందించాలని చెప్పారు.

చట్టం రూపొందించిన తర్వాత దానిని నేరుగా అమలు చేయకుండా ముందుగా శాసనసభలో విస్తృత చర్చ నిర్వహించాలని సీఎం తెలిపారు. అధికార పక్షంతో పాటు ప్రతిపక్ష సభ్యులు కూడా తమ సూచనలు చేసే అవకాశం కల్పించాలని, ప్రజల నుంచి కూడా అభిప్రాయాలు స్వీకరించాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల సూచనలను పరిగణనలోకి తీసుకుని చట్టానికి తుది రూపం ఇవ్వాలని ఆదేశించారు. దీని ద్వారా ప్రజలకు ఉపయోగపడే, సమర్థవంతమైన చట్టం రూపొందుతుందని అభిప్రాయపడ్డారు. కల్తీని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వానికి అందించే *విజిల్‌బ్లోయర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచే విధానాన్ని రూపొందించాలని చెప్పారు. అలాగే ప్రజలు అనుమానాస్పద ఆహార పదార్థాలు, ఔషధాలు లేదా కల్తీకి సంబంధించిన ఫిర్యాదులు చేయడానికి ప్రత్యేక **టోల్‌ఫ్రీ నంబర్* ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదులపై వేగంగా స్పందించి తనిఖీలు నిర్వహించే ప్రత్యేక వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు.

కొత్త చట్టాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అమలు చేయకుండా ముందుగా *క్యూర్ (CURE)* ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అక్కడ చట్టం అమలులో ఎదురయ్యే సమస్యలు, లోటుపాట్లు, ప్రజల స్పందన, అధికార యంత్రాంగం ఎదుర్కొనే సవాళ్లను విశ్లేషించిన తర్వాత అవసరమైన మార్పులు చేసి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. దీంతో చట్టం మరింత సమర్థవంతంగా అమలవుతుందని అభిప్రాయపడ్డారు.

కల్తీ ఆహారం, నకిలీ ఔషధాలు కేవలం వ్యక్తిగత ఆరోగ్య సమస్య మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, ఎగుమతులు, వినియోగదారుల హక్కులు వంటి అనేక రంగాలపై ప్రభావం చూపే అంశమని సీఎం పేర్కొన్నారు. అందువల్ల ఈ సమస్యపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో బలమైన నిబంధనలు ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం, విశ్వసనీయమైన ఔషధాలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కల్తీకి పూర్తిగా అడ్డుకట్ట వేసేలా చట్టాన్ని రూపొందించి దేశానికి ఆదర్శంగా నిలిపే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సి.వి. ఆనంద్, సీఎం సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి. శేషాద్రి, ఎన్. శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కల్వకుంట్ల కుటుంబం నిజాంను మించిన ధనవంతులు

మొదటిపేజీ తరువాయి

ఆయనను తన 'ఆత్మబంధువు'గా అభివర్ణించారు. గత పాలకులు ఆయన వంటి గొప్ప కళాకారులను విస్మరించారని మండిపడ్డారు. ఇదే క్రమంలో, కల్వకుంట్ల కుటుంబంపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు.

గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతను పట్టించుకోకపోవడంతో వారు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఏళ్ల తరబడి గ్రూప్1 వంటి పరీక్షలు కూడా నిర్వహించలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అందుకు భిన్నంగా, తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే సుమారు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, అభ్యర్థుల తల్లిదండ్రుల సమక్షంలోనే నియామక పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

ఫామ్‌హౌస్‌ల నిర్మాణం కోసం కేసీఆర్ కుటుంబం తెలంగాణ సంపదను దోచుకుందని, మళ్లీ ఎవరైనా అటువంటి ప్రయత్నం చేస్తే ఎదిరించడానికి అందెశ్రీ పాట రూపంలో పుడతాడని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందెశ్రీని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని దుయ్యబట్టారు. ప్రజాకవి గద్దర్‌ను సైతం ప్రజాభవన్ గేటు వద్ద ఎర్రటి ఎండలో నిలబెట్టి అవమానించారని మండిపడ్డారు. వారిద్దరిని అవమానించినప్పుడే దొరల పాలనకు చరమగీతం పాడాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



## అంతరిక్షంలోకి దూసుకెళ్లిన 'విక్రమ్1'

- **భారత ప్రైవేట్ స్పేస్ రంగంలో కొత్త అధ్యాయం**
- **శ్రీహరికోట నుంచి స్కైరూట్ తొలి ఆర్బిటల్ రాకెట్ విజయవంతమైన ప్రయోగం**
- **35 నిమిషాల ఆలస్యానంతరం నింగిలోకి.. నిర్ణీత కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాలు**
- **ప్రధాని మోదీ చేతిరాత 'వందేమాతరం'తో పాటు ప్రత్యేక పేలోడ్లు**
- **'మిషన్ ఆగమన్'తో భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి చారిత్రక ముందడుగు**



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యానికి చారిత్రక మైలురాయి నెలకొంది. ప్రముఖ స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్1' శనివారం విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) తొలి ప్రయోగ వేదిక నుంచి మధ్యాహ్నం 12.05 గంటలకు ఈ ప్రయోగాన్ని చేపట్టగా, రాకెట్ విజయవంతంగా ప్రయాణించి తన పేలోడ్లను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది.

వాస్తవానికి ఈ ప్రయోగాన్ని ఉదయం 11.30 గంటలకు నిర్వహించాల్సి ఉండగా, కౌంట్‌డౌన్ చివరి దశలో సాంకేతిక లోపం గుర్తించారు. ఇంధన నింపే ప్రక్రియలో సమస్య తలెత్తడంతో ప్రయోగాన్ని తాత్కాలికంగా నిలిపివేసి శాస్త్రవేత్తలు అత్యవసర పరిశీలనలు చేపట్టారు. లోపాన్ని సరిచేసిన అనంతరం 35 నిమిషాల ఆలస్యంగా రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారు. దాదాపు 20 నిమిషాల ప్రయాణం అనంతరం విక్రమ్1 తన పేలోడ్లను నిర్ణీత లో ఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టింది. ప్రయోగం విజయవంతం కావడంతో "హలో స్పేస్... విక్రమ్1 వచ్చేసింది" అంటూ స్కైరూట్ సంస్థ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆనందాన్ని పంచుకుంది.

**అంతరిక్షంలోకి 'వందేమాతరం'**

ఈ ప్రయోగంలో సాంకేతిక పేలోడ్లతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన భావోద్వేగ చిహ్నాలను కూడా రోదసిలోకి పంపించారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో రాసిన 'వందేమాతరం' సందేశంతో కూడిన ప్రత్యేక పోస్టుకార్డును రాకెట్‌లో భద్రపరిచారు. అలాగే కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్ని కూడా అంతరిక్షంలోకి పంపించారు. ఆ ప్రతిరూపంపై భారత అంతరిక్ష, విజ్ఞాన రంగానికి సేవలందించిన సర్ సీవీ రామన్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూక్ష్మ చిత్రాలను చెక్కారు.

అంతేకాకుండా, ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ స్కైరూట్ బృంద సభ్యులు, ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు తదితరులు స్వహస్తాలతో రాసిన డజన్ల కొద్దీ పోస్టుకార్డులను ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరచి రోదసిలోకి పంపడం విశేషంగా నిలిచింది.

**'మిషన్ ఆగమన్'కు శ్రీకారం**


ఈ చారిత్రక ప్రయోగానికి స్కైరూట్ 'మిషన్ ఆగమన్' అనే పేరు పెట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ పేరును ఎంపిక చేసినట్లు సంస్థ తెలిపింది. విక్రమ్1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్ట్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు స్కైరూట్ అభివృద్ధి చేసిన 'స్కోప్' పేలోడ్‌ను కూడా రోదసిలోకి పంపించారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్షంలో పరీక్షించి కీలక సాంకేతిక సమాచారాన్ని సేకరించనున్నారు. భవిష్యత్తులో వాణిజ్య ప్రయోగాలకు అవసరమైన సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా సంస్థ పేర్కొంది.

**పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో..**

సుమారు ఏడు అంతస్తుల భవనం ఎత్తుతో రూపొందించిన విక్రమ్1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 450 కిలోమీటర్ల ఎత్తులోని లో ఎర్త్ ఆర్బిట్‌లో 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను ప్రవేశపెట్టగల సామర్థ్యం కలిగి ఉంది. ఇప్పటికే 2022లో విక్రమ్‌ఎస్ ద్వారా భారత తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన స్కైరూట్... ఇప్పుడు 'విక్రమ్1'తో దేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగాన్ని విజయవంతం చేసి భారత అంతరిక్ష రంగ చరిత్రలో మరో అరుదైన ఘట్టాన్ని లిఖించింది.

## స్కైరూట్ బృందానికి ప్రధాని మోదీ అభినందనలు

మొదటిపేజీ తరువాయి



కేవలం తొలి అడుగు మాత్రమే. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లి భారత అంతరిక్ష రంగాన్ని కొత్త శిఖరాలకు చేర్చాలి'' అని మోదీ పేర్కొన్నారు.

విక్రమ్1 విజయంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగం కొత్త యుగంలోకి అడుగుపెట్టిందని ఆయన అభినందించారు. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఈ రాకెట్ దేశ యువ శాస్త్రవేత్తల ప్రతిభకు, భారత స్టార్టప్‌ల సామర్థ్యానికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు.

మరోవైపు, ప్రధాని నుంచి అభినందనలు అందుకోవడం తమకు గర్వకారణమని స్కైరూట్ వ్యవస్థాపకులు తెలిపారు. భారత అంతరిక్ష రంగంలో మరిన్ని వినూత్న ప్రయోగాలు చేపట్టి ప్రపంచ స్థాయిలో దేశ ప్రతిష్ఠను మరింత పెంచేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. విక్రమ్1 విజయవంతమైన ప్రయోగంతో చిన్న ఉపగ్రహాల వాణిజ్య ప్రయోగాల రంగంలో భారత్‌కు కొత్త అవకాశాలు తెరుచుకున్నాయి. ఈ విజయం దేశీయ స్పేస్‌టెక్ స్టార్టప్‌లకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అంతరిక్ష రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## హర్మూజ్‌లో పేలిన చమురు ట్యాంకర్లు

- **ఐఆర్‌జీసీ సంచలన ప్రకటన..**
- **'అది అవాస్తవం' అంటూ ఖండించిన అమెరికా**
- **హర్మూజ్ జలసంధిలో రెండు ట్యాంకర్లు పేలిపోయాయని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటన**
- **అమెరికా నిఘా సంస్థలే ఆ మార్గంలో పంపాయని ఐఆర్‌జీసీ ఆరోపణ**
- **ఈ వాదనను పూర్తిగా ఖండించిన అమెరికా సెంట్‌కామ్**
- **యుద్ధం మరింత ఉధృతం.. బాబ్ అల్-మాండెబ్‌పైనా ఉద్రిక్తతలు**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్నాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి చుట్టూ సైనిక ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, సముద్ర మైన్లు (మందుపాతరలు) మరో పెద్ద ముప్పుగా మారాయి. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలో రెండు చమురు ట్యాంకర్లు మైన్లను ఢీకొని పేలిపోయాయని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) శనివారం ప్రకటించింది. అయితే ఈ వాదనను అమెరికా సెంట్రల్ కమాండ్ వెంటనే ఖండిస్తూ, "ఇది పూర్తిగా అవాస్తవం" అని స్పష్టం చేసింది.

ఐఆర్‌జీసీ ప్రకటన ప్రకారం.. అమెరికా నిఘా సంస్థల సూచనలతో హర్మూజ్ దక్షిణ భాగంలోని మైన్లు ఉన్న మార్గంలో రెండు చమురు ట్యాంకర్లు ప్రయాణించాయని, దీంతో అవి పేలిపోయి మంటలకు ఆహుతయ్యాయని పేర్కొంది. అలాగే అదే మార్గంలో వెళ్లేందుకు ప్రయత్నించిన మరో నాలుగు నౌకలను క్షిపణులు, డ్రోన్ల సాయంతో అడ్డుకున్నామని వెల్లడించింది. అయితే ఈ ఘటనకు సంబంధించి ట్యాంకర్ల వివరాలు, స్వతంత్ర ధ్రువీకరణ మాత్రం వెలువడలేదు.

మరోవైపు అమెరికా వరుసగా ఏడో రోజు కూడా ఇరాన్‌పై వైమానిక దాడులు కొనసాగించింది. దక్షిణ ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్లు చోటుచేసుకున్నట్లు సమాచారం. అమెరికా దాడులు కొనసాగితే తాము పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమవుతామని ఇరాన్ హెచ్చరించింది. అలాగే అమెరికా మిత్రదేశాల్లోని సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో ప్రతీకార దాడులను కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది.

ఇదే సమయంలో తమ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించిన ఇరాన్.. ఎర్ర సముద్రంలోని బాబ్ అల్‌మాండెబ్ జలసంధిలో సముద్ర రవాణాకు అంతరాయం కల్పించే అవకాశాన్ని కూడా ప్రస్తావించింది. ఇరాన్‌కు మద్దతుగా ఉన్న హూతీ బలగాలు ఆ మార్గంలో చర్యలు చేపడితే ప్రపంచ చమురు, వాణిజ్య సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు.





## బంగారు పోచమ్మ దేవాలయానికి ఐదు లక్షల రూపాయలు విరాళము

- **లలిత ఫౌండేషన్ చైర్మన్ నీలం నర్సింగరావు భార్య జ్ఞాపకార్థం**

**హైద్రాబాద్ జులై 18(ప్రజాక్షేత్రం):**

లలిత ఫౌండేషన్ చైర్మన్ నీలం నర్సింగ్ రావు వారీ భార్య జ్ఞాపకార్థం బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 4 సుఖదేవ్ నగర్ లో ఉన్న గుడికి బంగారు పోచమ్మ దేవాలయానికి ఐదు లక్షల రూపాయలు గ్రిల్స్ వర్క్ కోసం విరాళం అంద చేయడం జరిగింది లలిత ఫౌండేషన్ చైర్మన్ నీలం నరసింహారావు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ఎంతోమంది పేద ప్రజలకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తూ పేద ప్రజలకు చేదోడుగా వాదోడుగా ఉంటున్నారు. ఈ కార్యక్రమంలో గుడి పంతులు పంచ కమిటీ సభ్యులు రాజారాం, మోహన్, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కన్న పేగును కడతేర్చిన.. కసాయి తండ్రి

- **భార్యాభర్తల గొడవ.. పాపం 18 రోజుల పసికందు అనంత లోకాలకు**
- **భార్యతో గొడవలు.. 18 రోజుల పసికందును నేలకేసి కొట్టి చంపిన తండ్రి**



**అందోల్ జులై 18(ప్రజాక్షేత్రం):**

సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలో భార్యతో తరచూ గొడవలు జరుగుతుండటంతో.. కన్న బిడ్డపట్ల కర్కశంగా ప్రవర్తించాడో దుర్మార్గపు తండ్రి. పసికందు అని కూడా చూడకుండా నేలకేసి కొట్టి.. అతి క్రూరంగా చంపేశాడు. ఈ దారుణ ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట వాసవి నగర్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. జోగిపేట పట్టణ కేంద్రంలో వాసవి నగర్ కాలనీ లో నివసిస్తున్న కృష్ణ, గౌరమ్మలు పెద్దలను ఎదిరించి ప్రేమ పెళ్లి చేసుకున్నారు. వీరి దాంపత్యానికి గుర్తుగా 18 రోజుల క్రితమే మగబిడ్డ జన్మించాడు. అయితే.. తరచూ భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం ఉదయం కూడా భార్య గౌరమ్మతో గొడవపడిన కృష్ణ.. ఆవేశంలో తల్లిపాలు తాగుతున్న బిడ్డను లాగి.. చెంపలపై కొట్టాడు. దీంతో గౌరికి కోపం మరింత పెరిగి ఇలా చేస్తే పోలీసులకు కంప్లెంట్ చేస్తానని హెచ్చరించింది. కోపంతో ఊగిపోయిన కృష్ణ.. 18 రోజుల పసికందును గుక్కపెట్టి ఏడుస్తున్నా వదలకుండా నేలకేసి కొట్టాడు. దాంతో గౌరమ్మ గట్టిగా కేకలు వేసింది. తీవ్ర గాయాలతో కొనఊపిరితో ఉన్న బిడ్డను వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకుని వెళ్లగా.. వైద్యులు చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. దీంతో గౌరమ్మ గుండెలవిసేలా రోదించింది. తన భర్తే బిడ్డను చంపేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కృష్ణను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీరని విషాదాన్ని చోటుచేసుకుంది.

## చీకటి రహదారిపై వెలిగిన మానవత్వం.

- **సొంత ఖర్చుతో వీధిలైట్లు వేయించిన ప్రజానేత**
- **అధికారులు పట్టించుకోకున్నా ప్రమాదాల నివారణకు మాజీ సర్పంచ్ చొరవ**
- **హిమాయత్‌నగర్ చౌరస్తా - ఎన్కపల్లి రోడ్డుకు వెలుగులు తెచ్చిన సంగెం వినాయక రావు**
- **'పదవులు ముఖ్యం కాదు.. ఊరి శ్రేయస్సే లక్ష్యం' అని నిరూపించిన వైనం**



**మొయినాబాద్,జులై 18(ప్రజాక్షేత్రం):**

అది హిమాయత్‌నగర్ చౌరస్తా నుంచి యెన్కెపల్లి వెళ్లే ప్రధాన రహదారి. ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణించే ఆ దారి, గత కొన్ని రోజులుగా సూర్యుడు అస్తమించగానే ఘాడ చీకట్లోకి జారుకునేది. వీధిలైట్లు వెలగకపోవడంతో రోడ్డు ఎక్కడుందో తెలియని పరిస్థితి. ఈ చీకటి తెచ్చిన శాపమో ఏమో.. మొన్నటికి మొన్న అదే దారిపై జరిగిన ఓ ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడంతో/తీవ్రంగా గాయపడటంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అధికారులకు మొరపెట్టుకున్నా, స్థానిక నాయకులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. వ్యవస్థ నిర్లక్ష్యానికి ఇద్దరి జీవితాలు బలైపోయాయనే ఆవేదన అందరిలోనూ మిగిలిపోయింది.

కానీ, ఆ విషాద ఘటన గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సంగెం వినాయక రావు మనసును తీవ్రంగా కలచివేసింది. "పదవిలో ఉన్నామా లేదా అన్నది ముఖ్యం కాదు, మన కళ్ల ముందే మన గ్రామ ప్రజల ప్రాణాలు పోతుంటే చూస్తూ ఊరుకోలేం" అని ఆయన భావించారు. ప్రభుత్వ నిధులు ఎప్పుడు వస్తాయో, అధికారులు ఎప్పుడు స్పందిస్తారో అని ఎదురుచూడకుండా తనే స్వయంగా రంగంలోకి దిగారు.

తమ గ్రామ ప్రజల భద్రత కోసం తన సొంత ఖర్చుతో సరికొత్త వీధిలైట్లను కొనుగోలు చేశారు. స్వయంగా దగ్గరుండి ఆ లైట్లన్నింటినీ స్తంభాలకు బిగింపజేశారు. నిన్నటివరకు చీకటితో భయపెట్టిన ఆ ప్రధాన రహదారి, ఇప్పుడు వినాయక రావు తెచ్చిన వెలుగులతో ధగధగలాడుతోంది.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సంగెం వినాయక రావు మాట్లాడుతూ.. "మళ్లీ ఇలాంటి ప్రమాదం జరిగి ఏ కుటుంబం రోడ్డున పడకూడదనే ఉద్దేశంతోనే నా వంతు బాధ్యతగా ఈ నిర్ణయం తీసుకున్నాను. పదవులు ఉన్నా లేకున్నా నా ఊరు, నా ప్రజల శ్రేయస్సే నాకు ముఖ్యం. భవిష్యత్తులోనూ మా గ్రామ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని భావోద్వేగంతో స్పష్టం చేశారు.

అధికారులు చేయాల్సిన పనిని, ఒక బాధ్యతాయుతమైన నాయకుడిగా తన సొంత నిధులతో పూర్తి చేసి, గ్రామంలో మళ్లీ వెలుగులు నింపిన వినాయక రావు సేవాభావాన్ని చూసి యెన్కెపల్లి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు."మా గ్రామం మా గర్వం.. మీ సేవ మా భవిష్యత్తు కోసం" అంటూ గ్రామస్తులంతా ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నారు.

# పేపర్ లీకేజీలతో ఎన్నో కుటుంబాల్లో విషాదం

**మొదటిపేజీ తరువాయి**

ఎంతో మంది ప్రతిభావంతులైన విద్యార్థుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారు తీవ్రమైన మానసిక వేదనను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన సమయం ఆసన్నమైందని, విద్యార్థులకు పూర్తి నమ్మకం, భద్రత కల్పించేలా దీనిని పునర్నిర్మించాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. శనివారం ఉదయం రాహుల్ గాంధీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక సుదీర్ఘమైన మరియు భావోద్వేగభరితమైన పోస్టను పెట్టారు. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా పెద్ద దుమారం రేపిన నీట్ (NEET) పరీక్ష పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో, తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన రియా అనే విద్యార్థిని ఉదంతాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. రియా మరణం తర్వాత ఆమె తండ్రి రాజేశ్‌తో తాను స్వయంగా మాట్లాడిన విషయాలను, ఆ సమయంలో ఆయన పడిన బాధను రాహుల్ ఈ పోస్టులో గుర్తు చేసుకున్నారు.

కంటికి రెప్పలా పెంచుకున్న తన ప్రాణాలకంటే ఎక్కువైన కుమార్తెను కోల్పోయిన బాధతో తండ్రి రాజేశ్ గుండె పగిలేలా ఏడ్చారని, ఆయన మానసికంగా పూర్తిగా కుంగిపోయారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒక మధ్యతరగతి తండ్రి తన బిడ్డను పెద్ద చదువులు చదివించి ప్రయోజకురాలిని చేయాలనుకుంటే, ఈ లీకేజీల వ్యవస్థ ఆమె ప్రాణాలనే బలితీసుకుందని మండిపడ్డారు. రాజేశ్ అనుభవిస్తున్న ఈ భరించలేని వేదన, కడుపుకోత విన్న ప్రతి ఒక్కరి హృదయాలను కలచివేస్తోందని రాహుల్ అన్నారు.

ఈ ఘోరమైన పరిణామం కేవలం ఒక రియా కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగత విషాదం మాత్రమే కాదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశంలో పేపర్ లీకేజీలనేవి ఒక మాఫియాగా మారి లక్షలాది మంది విద్యార్థుల కలలను, వారి భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం మరియు పరీక్షల నిర్వహణ సంస్థల వైఫల్యం వల్ల ఎంతో మంది అమాయక విద్యార్థులు నిరాశతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, పాలకుల తప్పులకు పిల్లలు బలికావడం దారుణమన్నారు.పోటీ పరీక్షల ఫలితాల జాబితాలో కనిపించే లేదా వార్తల్లో వినపడే ప్రతి విద్యార్థి పేరు వెనుక ఒక కన్నతల్లి, ఒక కన్నతండ్రి ఉంటారని రాహుల్ గాంధీ గుర్తు చేశారు. వారు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వారి బంగారు భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమిస్తారని చెప్పారు. కానీ ఈ లీకేజీల భూతం ఆ తల్లిదండ్రులకు తమ పిల్లలను శాశ్వతంగా దూరం చేస్తోందని, బిడ్డలు లేని ఆ కన్నవారి జీవితాలు రేపటి రోజు అనేది లేకుండా పూర్తిగా చీకటిమయంగా మారిపోతున్నాయని ఆవేదన చెందారు.

పరీక్షల విధానంలో ఉన్న లోపాల వల్ల విద్యార్థులు విపరీతమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని రాహుల్ గాంధీ విశ్లేషించారు. అక్రమార్కుల చేతుల్లోకి పేపర్లు వెళ్తుంటే, కష్టపడి చదివే పిల్లలు అభద్రతాభావంతో నలిగిపోతున్నారన్నారు. విద్యార్థులు ఎలాంటి భయాలు, ఆందోళనలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో, పూర్తి భద్రతతో పరీక్షలు రాసేలా ప్రస్తుత నిబంధనలను మార్చాలన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోతే యువత నమ్మకం కోల్పోతుందని హెచ్చరించారు.తమ పిల్లలను డాక్టర్లుగానో, ఇంజినీర్లుగానో చూడాలని తల్లిదండ్రులు తమ రక్తాన్ని చెమటగా మార్చి, తిండి తిని తినక డబ్బులు కూడబెట్టి చదివిస్తారని, వారు చేసే త్యాగాలు అంత తేలికైనవి కావని రాహుల్ అన్నారు. కన్నవారు చేసిన ఆ త్యాగాలకు ప్రతిఫలంగా వారికి దక్కాల్సింది పిల్లల విజయాలు, వారి ముఖాల్లో సంతోషమే కానీ.. ఇలాంటి పేపర్ లీకేజీల వల్ల వచ్చే కన్నీళ్లు, గుండెకోత కాదన్నారు. న్యాయం కోసం ఎదురుచూస్తున్న



తల్లిదండ్రులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు.

ఇకనైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యారంగంలో, పరీక్షల నిర్వహణ సంస్థల్లో సమూలమైన మార్పులను తీసుకురావాలని రాహుల్ గాంధీ గట్టిగా కోరారు. తప్పు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చట్టాలు తేవాలన్నారు. దేశంలోని ప్రతి విద్యార్థికి పూర్తి భద్రత లభించే వరకు, బాధితులైన తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్ లోపలా, వెలుపలా తన పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

## గంజాయి సాగు పై జిల్లా టాస్క్‌ఫోర్డ్ దాడి

- **22 కిలోల గంజాయి స్వాధీనం**

**వికారాబాద్ జులై 18(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు వికారాబాద్ డిఎస్పి అంజయ్య ఆధ్వర్యం లో విశ్వసనీయ సమాచారం ఆధారంగా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేసి అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారి వద్ద భారీ మొత్తంలో గంజాయి ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితులు రామ్ హరి (43), తండ్రి కంగలి, పాశి గ్రామం, గంజాం జిల్లా, ఒడిశా రాష్ట్రం మరియు కలాబాబు ఖాన్ (33), తండ్రి తాల్బు ఖాన్, కొలకిరి గోపాలపూర్, జత్‌పూర్, ఒడిశా రాష్ట్రం గా గుర్తించారు. కలాబాబు ఖాన్ హోటల్‌లో వంటమనిషిగా పనిచేస్తుండగా, రామ్ హరి కూడా ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పోలీసుల విచారణలో నిందితులు తెలిపిన వివరాల ప్రకారం, ఒడిశా రాష్ట్రంలోని బెర్హాంపూర్ రైల్వే స్టేషన్‌లో పరిచయమైన వీరిద్దరూ ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చుకోవాలనే ఉద్దేశంతో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. గంజాం జిల్లాకు చెందిన సునీల్ పాండీ అనే వ్యక్తి ఒడిశా నుంచి హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలకు గంజాయిని అక్రమంగా సరఫరా చేస్తూ పెద్ద ఎత్తున మాదకద్రవ్యాల వ్యాపారం నిర్వహిస్తున్నాడని తెలుసుకుని అతనితో సంబంధాలు ఏర్పరుచుకున్నారు. అతని నుంచి గంజాయి తీసుకుని, విక్రయాల ద్వారా వచ్చే లాభాల్లో 40 శాతం తమకు వాటాగా తీసుకుంటూ, అతను సూచించిన ప్రాంతాల్లో నిర్ణయించిన వ్యక్తులకు గంజాయిని అందజేసే బాధ్యతను నిర్వర్తిస్తున్నట్లు వారు అంగీకరించారు. సునీల్ పాండీ ఆదేశాల మేరకు నిందితులు ఒడిశాలోని బెర్హాంపూర్ రైల్వే స్టేషన్ నుంచి రైలులో సికింద్రాబాద్‌కు చేరుకుని, అక్కడి నుంచి మరో రైలులో వికారాబాద్‌కు వచ్చారు. వికారాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని ప్లాట్‌ఫారం పక్కన ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో వేచి ఉండగా, ముందస్తు సమాచారంతో నిఘా పెట్టిన పోలీసు బృందం వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ నిర్వహించింది. తనిఖీలలో కలాబాబు ఖాన్ వద్ద 9 కిలోల గంజాయి, రామ్ హరి వద్ద 21 కిలోల గంజాయి లభ్యమవగా, మొత్తం 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితు



లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయిని సీజ్ చేసి, NDPS చట్టాల ప్రకారం వికారాబాద్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ మాదకద్రవ్యాల సరఫరా వెనుక ఉన్న ప్రధాన నిందితుడు, ఇతర నెట్‌వర్క్ సభ్యులు, గంజాయిని స్వీకరించాల్సిన వ్యక్తుల వివరాలను సేకరించే దిశగా దర్యాప్తును పోలీసులు విస్తరించారు. ఈ సందర్భంగా వికారాబాద్ డిఎస్పి అంజయ్య మాట్లాడుతూ, "మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగం సమాజానికి, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు తీవ్ర ముప్పుగా మారుతున్నాయి. గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై వికారాబాద్ జిల్లా పోలీసులు ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు కొనసాగిస్తారు. రాష్ట్రాల మధ్య మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. గంజాయి విక్రయాలు, నిల్వలు లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలి. ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతాం. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు పోలీసులకు సహకరించాలని" కోరారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించి భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, ప్రత్యేక పోలీసు బృందంలోని అధికారులు, సిబ్బందిని వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించడం జరిగింది అని వికారాబాద్ డిఎస్పి అంజయ్య తెలియజేయడం జరిగింది.

## ఖిల్లా, చర్చ్‌ను సందర్శించిన హీరో మంచు విష్ణు

**మెదక్ జులై 18(ప్రజాక్షేత్రం):**

ప్రముఖ సినీ నటుడు మంచు విష్ణు మెదక్ పట్టణంలోని చారిత్రాత్మక మెదక్ ఖిల్లాను, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చ్‌ను సందర్శించారు. ఖిల్లాలోని చారిత్రక నిర్మాణాలను పరిశీలిస్తూ వాటి విశిష్టతను, చర్చ్ గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంచు విష్ణు మాట్లాడుతూ.. చారిత్రక ప్రాధాన్యత కలిగిన మెదక్ ఖిల్లా ను రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటే దేశ విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే తాను నిర్మించబోయే తదుపరి సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను మెదక్ ఖిల్లాలో చిత్రీకరించే ఆలోచన ఉందని తెలిపారు. మెదక్ ఖిల్లా సహజ సిద్ధమైన అందాలు, చారిత్రక వైభవం సినిమా చిత్రీకరణ కు ఎంతో అనుకూలంగా ఉన్నాయని ఆయన అన్నారు. చర్చ్ ను సందర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మంచు విష్ణు ఖిల్లా సందర్శన సందర్భంగా అభిమానులు, స్థానికులు ఆయన ను కలిసి ఫొటోలు



దిగారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, టూరిజం జిల్లా అధికారి రమేష్, మున్సిపల్ రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్స్ గంట సంపత్, అఖిల్, హరిత, అరుణ, కో ఆప్షన్ తాహెర్, నాయకులు బొజ్జ పవన్, రాగి అశోక్, భూపతి రాజు, తదితరు

## ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకుల పోరాటం

- **నందిగామ పోలీస్ స్టేషన్ నుండి కార్తీక్ రెడ్డి,రైతులను బేషరతుగా విడుదల**
- **నిరసనలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

**శంషాబాద్ జూలై18 (ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని బహుదూర్‌గూడ గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు తమ భూములు ఇవ్వబోమని చేపట్టిన నిరసనకు మద్దతుగా వెళ్లిన రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని మరియు రైతులను పోలీసులు అరెస్ట్ చేసి నందిగామ పోలీస్ స్టేషన్ తరలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి,మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ తో మరియు షాద్ నగర్ బీఆర్ఎస్ నాయకులతో నందిగామ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని,రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపిన అనంతరం,పోలీసు అధికారులతో మాట్లాడి వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా,బేషరతుగా విడుదల చేయాలని కోరగా పోలీసులు ఆయనను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజా ప్రతినిధులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మరకత లింగేశ్వరుడి సన్నిధిలో మాజీ మంత్రి ప్రసన్న కుమార్ రెడ్డి

**శంకర్‌పల్లి జూలై 18(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలిసిన 11వ శతాబ్దపు మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో శనివారం అర్చకులు సాయి శివ ఆధ్వర్యంలో మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కడకంచి కుమార్ యాదవ్.. మాజీ మంత్రిని స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం ఎంతో అనుభూతినిచ్చిందన్నారు. స్వామి వారి దయతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, స్వామి వారిని కోరుకున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ క్యాషియర్ ప్రశాంత్ గౌడ్, జనార్ధన్ పాల్గొన్నారు.



# కరాటే ప్రదర్శనలో విద్యార్థిని రికార్డు

- **గిన్నిస్ బుక్‌లోకి ఎక్కిన కుర్వ సాయి సహస్ర**
- **మెడల్, సర్టిఫికెట్ అందజేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**శంకర్ పల్లి, జూలై 18(ప్రజాక్షేత్రం):**

కరాటే రంగంలో శంకర్ పల్లికి చెందిన విద్యార్థిని అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. స్థానిక రేవతి హైస్కూల్ విద్యార్థిని కుర్వ సాయి సహస్ర, కరాటే మాస్టర్ రవీందర్‌తో కలిసి ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. గత ఏప్రిల్ 26న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 'విజన్ మార్షల్ ఆర్ట్స్' ఆధ్వర్యంలో మహా కరాటే ప్రదర్శన నిర్వహించారు. సుమారు 1212 మంది కరాటే యోధులు పాల్గొన్న ఈ ప్రదర్శనలో, సాయి సహస్ర 20 నిమిషాల పాటు ఆగకుండా అద్భుతమైన కరాటే విన్యాసాలు చేసి అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనకు గానూ తాజాగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, మెడల్స్ విడుదలయ్యాయి.

**ఘనంగా సన్మానం**

గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థిని సాయి సహస్రను శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్మన్ సాతా ప్రవీణ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థినికి గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్, మెడల్ అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇలాంటి అంతర్జాతీయ వేదికలపై రాణించడం గర్వకారణమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థిని తండ్రి (ఆర్టీసీ కండక్టర్) ఇందూర్ రాజు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రకాష్ నగర్ లోని పోతురాజు దేవాలయం పక్కన మసీదు నిర్మాణ పనులు ఆపించండి

- **శంషాబాద్ మండల సిపిఐ కార్యదర్శి నర్రగిరి.**

**శంషాబాద్ జులై 18 (ప్రజాక్షేత్రం):**

శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ప్రకాష్ నగర్ లోని పోతురాజు దేవాలయం పక్కన సర్వే నెంబర్ 124/1ఎ 124/25ఎ భూమి యజమాని అయినటువంటి షరీఫ్ పోతురాజు దేవాలయ పక్కన మజీద్ నిర్మించడానికి పూనుకున్నాడు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆ కాలనీ వాసి.నర్రగిరి అన్నారు.ఇట్టి విషయాన్ని స్థానిక జిహెచ్ఎంసి అధికారులను కలిసి ఈ యొక్క మసీదు పోతురాజు దేవాలయాలు ఒక దగ్గర అవుతాయని వీటి వలన భవిష్యత్తులో హిందూ ముస్లిం గొడవలు ప్రారంభమై మత కలహాలకు దారితీస్తాయని ఒక మత మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్న ఈ నిర్మాణాన్ని తక్షణమే ఆపాలని నర్రగిరి డిమాండ్ చేశారు. జోనల్ కమిషన్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు.నిర్మాణ పనులను తక్షణమే ఆఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. బలవంతంగా నిర్మాణం చేస్తే పై అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చి ఆ తదుపరి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.ప్రభుత్వం అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని అట్టి నిర్మాణ పనులు ఆపాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో నర్ర యాదగిరి,నర్ర శ్రీను,నర్ర రామారావు,మొక్కల విజయ్ కుమార్,మొక్కల శేఖర్,మక్కల ప్రేమ్,మక్కల నరేష్,మొక్కల రాజు,తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఎఫ్ఐ శంషాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో నూతన కాలేజ్ కమిటీల ఏర్పాటు

**శంషాబాద్ జూలై 18(ప్రజాక్షేత్రం):**

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) శంషాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల్లో నూతన కాలేజ్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కే.వై. ప్రణయ్ మాట్లాడుతూ, 1970లో ఆవిర్భవించిన ఎస్ఎఫ్ఐ విద్యార్థుల హక్కులు, విద్యారంగ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న దేశంలోని అతిపెద్ద విద్యార్థి సంఘాలలో ఒకటిగా నిలిచిందని అన్నారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే విలువలను ఆదర్శంగా తీసుకొని, భగత్‌సింగ్ ఆశయాల సాధన కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.10,814 కోట్లు పేరుకుపోయాయని పేర్కొన్నారు. ఈ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కొరత, అధ్యాపకుల ఖాళీలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో తీవ్ర జాప్యం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

అనంతరం నూతనంగా ఎన్నికైన కాలేజ్ కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. బాయ్స్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా శివ రాథోడ్, కాసిం. గర్ల్స్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా నిహారిక సాయి హర్ష ల ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ శంషాబాద్ మండల నాయకులు నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వరి వద్దు.. ప్రత్యామ్నాయ పంటలే ముద్దు

**చేగుంట జులై 18(ప్రజాక్షేత్రం):**

ఎల్ నినో' వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువగా నమోదవుతుందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం చేగుంటలో నిర్వహించిన ఎల్నినో వాతావరణ పరిస్థితుల్లో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎల్నినినో ప్రభావంతో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగి సాధారణ వర్షపాతం తగ్గే అవకాశం ఉంటుందని దీనివల్ల వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగు రైతులకు ఇబ్బందులు కలిగించవచ్చని అన్నారు. అందువల్ల వినియోగం తక్కువగా ఉండే పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని సూచించారు.

**విద్యార్థులకు బ్యాగుల పంపిణీ**

వరి సాగుకు బదులుగా పెసర, మినుము, కంది, ఆముదం, నువ్వులు, ప్రొద్దుతిరుగుడు వంటి నూనెగింజల పంటలు అలాగే జొన్న, సజ్జ రాగులు వంటి చిరుధాన్యాల సాగు రైతులకు అనుకూలమని పేర్కొన్నారు. ఆయా పంటల సాగుకు అనువైన విత్తే సమయం విత్తన మోతాదు పంట కాలం ఆశించిన దిగుబడులపై వ్యవసాయ అధికారులు రైతులకు వివరించారు. నీటి పొదుపు పద్ధతులు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే సాగు విధానాలు తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే పంటల ఎంపిక మార్కెట్ అవకాశాలపై రైతులకు సూచనలు అందించారు. అనంతరం మంత్రి చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది అని ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో కృషి చేయాలని సూచించారు.




గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. చేగుంట ప్రాంత విద్యార్థుల ఉన్నత విద్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేగుంటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేసేందుకు కృషి చేసి త్వరలోనే ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ ప్రకటనకు విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఆర్డీఓ బావయ్య, డీఏఓ విన్సెంట్ వినయ్ కుమార్, మండల్ స్పెషల్ ఆఫీసర్ హేమ భార్గవి, దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ బాలలక్ష్మి, ఎంపీడీవో చిన్న రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంగల్ రావు, సొసైటీ ఛైర్మన్ మ్యకల పరమేష్, చేగుంట గ్రామ సర్పంచ్ స్రవంతి, ఎంఈఓ నీరజ, వివిధ గ్రామ సర్పంచులు, ఉపాధ్యాయులు రైతులు విద్యార్థులు సంకల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విజయ, ప్రతినిధులు రామకృష్ణ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# తాండూరు–కోటపల్లి హైవే అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- **రూ.345.88 కోట్ల వ్యయంతో 143.53 కిలోమీటర్ల అభివృద్ధి**
- **రోడ్ల అభివృద్ధికి గాను 900 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.**

**వికారాబాద్ జులై 18(ప్రజాక్షేత్రం):**

దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణా రాష్ట్రం లో రోడ్ల అభివృది జరుగుతుందని,తెలంగాణా రాష్ట్ర శాసన సభా పతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారము వికారాబాద్ నియోజకవర్గం శివారెడ్డి పెట్ ఆర్ టి ఓ కార్యాలయం వద్ద 261 కోట్ల వ్యయం తో హ్యాం రోడ్ల పనులకు తెలంగాణా రాష్ట్ర శాసన సభా పతి వికారాబాద్ నియోజకవర్గ శాసన సభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ , రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి దుదిల్ల శ్రీదర్ బాబు ల తో కలిసి శంఖు స్థాపన చేశారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూవికారాబాద్ నియోజక వర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసారని, ప్రతి మండల కేంద్రానికి బిటి రోడ్డు, డబల్ రోడ్డు వేయాలనే లక్ష్యం తో నిధులు వచ్చాయని, నియోజకవర్గ స్థాయిలో స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ ను అభివృద్ధి చేస్తానని శ్రీ రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రోడ్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని,రోడ్లు& భవనాలు శాఖ ఆద్వర్యంలోరూ. 261కోట్లతోవ్యయం తో హ్యాం రోడ్ల పనులకు శంఖుస్థాపన చే శామన్నారు. శనివారం తాండూర్ నియోజక వర్గంలో 290 కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణాలు, బలోపేతం చేయడానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యేలు బుయ్యని మనోహర్ రెడ్డి, కాలె యాదయ్య, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీలతో కలిసి రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి శంకుస్థాపన గావించారు.

అనంతరం కందనెల్లి జెపిఆర్ గార్డెన్ లో జరిగిన సభలో రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్రంలో రోడ్ల నిర్మాణాల నిమిత్తం అత్యధిక నిధులను కేటాయించి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా తాండూరు నియోజకవర్గానికి 290 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. రోడ్ల సౌకర్యం మెరుగ్గా ఉంటే పరిశ్రమలు, వ్యాపారాలు వృద్ధి చెందుతాయని అలాగే ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ఆయన అన్నారు. మంజూరు అయిన పనులు వెంటనే చేపడతామని ఆయన అన్నారు. ప్రజా పాలన లో భాగంగా 30 మాసాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా అర్హుడైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు సన్న బియ్యాన్ని ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. 500 రూపాయల సబ్సిడీతో గ్యాస్ సిలిండర్లను ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి మహిళా సంఘాలకు 10 లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లోనే 900 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలకు జమ చేయడం జరిగిందని ఆ నీ సందర్భంగా తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను పటిష్ట పరిచే దిశగా యంగ్ ఇండియా పాఠశాలలను స్థాపించడం జరుగుతుందని మంత్రి అన్నారు.

కోర్టు కేసు పరిష్కారం అయిన వెంటనే 94 కోట్ల వ్యయంతో రైల్వే ఓవర్ వే బ్రిడ్జి పనులను 18 వారాల్లో చేపడతామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తూనే వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. 261 కోట్ల వ్యయంతో ప్రధాన రహదారులను నిర్మించేందుకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. రవాణా వ్యవస్థ మెరుగుపరిస్తేనే అభివృద్ధి సాధ్యమని మంత్రి అన్నారు. కాగ్న నదిలో మురుగునీరు కలవకుండా 30 కోట్లను మంజూరు చేసి పనులు మొదలు పెట్టడం జరిగిందని మంత్రి అన్నారు.



రైతులకు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయలను మాఫీని ప్రభుత్వం చేపట్టిందన్నారు. గ్రూప్1, గ్రూప్2 తదితర పరీక్షలు నిర్వహించి 70 వేల మందికి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించదని మందు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తూనే ఉదయం అల్పాహారం సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని ఆయన అన్నారు. తాండూర్ మున్సిపల్ పరిధిలో 571 మంది అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్ లను కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు మంత్రి తెలిపారు. అంతర్గత మురుగు కాలువల సమస్యలపై ప్రణాళికలు సిద్ధం చేస్తే అనుమతులు ఇస్తామని మంత్రి అన్నారు.

శాసన మండలి చీఫ్ విప్ పి.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం పేదల అభ్యున్నతి కృషి చేస్తూ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేయబడుతుందన్నారు. వికారాబాద్ రంగారెడ్డి జిల్లాల రోడ్ల అభివృద్ధికి అధిక నిధులు ఇచ్చారని, రోడ్ల అభివృద్ధితో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఆయన అన్నారు. కర్ణాటక సరిహద్దు రోడ్లకు నిధులను కేటాయించి అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. స్థానిక శాసనసభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.... తాండూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా అధిక నిధులను తీసుకురావడం జరుగుతుందన్నారు. మైనార్టీ సంక్షేమం కోసం 75 కోట్ల వ్యయంతో ఏటీసీని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని గత సంవత్సరం 165 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. బషీరాబాద్ రోడ్ల అభివృద్ధియే కాకుండా 30 పడకల ఆసుపత్రి, జూనియర్ కళాశాలలను మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.

**పరిగి అభివృద్ధికి మరో మైలురాయి – రూ.185 కోట్ల హ్యామ్ రోడ్ల పనులకు శ్రీకారం**

పరిగి మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్పూర్ గేట్ వద్ద రూ.185 కోట్ల వ్యయంతో చేపట్టనున్న హ్యామ్ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (SIR) శ్రీ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా శంకుస్థాపన చేశారు.

శంకుస్థాపన అనంతరం సుల్తాన్‌పూర్ గేట్ నుంచి ఏబీఎస్ ప్లాజా వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం పరిగి పట్టణంలోని ఏబీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం,అభివృద్ధి కార్యక్రమాల అమలు,ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంపై నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఇ.వెంకటాచారి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు,ఆర్డిఓ అనిత, ఆర్ అండ్ బి ఎస్.ఇ వసంత నాయక్,ఆర్య వైశ్య కార్పొరేషన్ సంస్థ చైర్ పర్సన్ కల్వ సుజాత, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి,కందనెల్లి సర్పంచ్ యాదమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ వారాహి ప్రత్యంగిరా మాత ఉత్సవాల్లో కెఎల్ఆర్

- **ఆర్.కె పురం డివిజన్ లో విస్తృతంగా పర్యటన**
- **కమ్యూనిటీ హాల్, టెలిఫోన్ కాలనీ పార్క్ అభివృద్ధి పనుల పరిశీలన**
- **కిచ్చెన్నకి ఘన స్వాగతం పలికిన నగరవాసులు.**

**మహేశ్వరం జులై.18 (ప్రజాక్షేత్రం):**



ఆషాడ మాస నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ వారాహి ప్రత్యంగిరా మాత దేవాలయంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్కేపురం డివిజన్ లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, అధ్యక్షులు పున్నా గణేష్ నేత, చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వారాహి, ప్రత్యంగిరా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆలయ కమిటీ, కాంగ్రెస్ నేతలకు లక్ష్మారెడ్డి సూచించారు.తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకులు లేకుండా పేదలందరికీ అందేలా చూడాలని... మహేశ్వరం నియోజకవర్గం ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కిచ్చెన్న వేడుకున్నారు.

అనంతరం రూ.50 లక్షలతో జరుగుతున్న టెలిఫోన్ కాలనీ కమ్యూనిటీ హాల్ ను పనులు, రూ.52 లక్షలతో అభివృద్ధి చేస్తున్న ఆర్కేపురం పార్క్, వాకింగ్ ట్రాక్ పనులను పరిశీలించారు కె ఎల్ ఆర్ . యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేసి నగర వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్లకు కిచ్చెన్న సూచించారు.

ఈ సందర్భంగా ఆర్కేపురం, ఎన్టీఆర్ నగర్ డివిజన్ల నాయకులు, స్థానికులు పలు సమస్యలను కెఎల్ఆర్ దృష్టికి తెచ్చారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని వాటర్ బోర్డు అధికారులకు లక్ష్మారెడ్డి కిచ్చెన్న విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, డివిజన్ లోని కాలనీ అధ్యక్షులు,పలు సంఘాల నేతలు,స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహేశ్వరం నియోజకవర్గంలో ముమ్మరంగా 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్ ) కార్యక్రమం

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి: కేఎల్ఆర్, డీబీఆర్
- ప్రజల కోసం హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలి.

**మహేశ్వరం జులై.18 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్ ) కార్యక్రమం మహేశ్వరం నియోజకవర్గంలో ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత కొన్ని రోజులుగా నియోజకవర్గంలో జరుగుతున్న 'సార్' ( ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, విజయవంతం చేస్తున్న బూత్ లెవెల్ ఏజెంట్లు ( బిఎల్ఎ), బి.ఎల్.ఓ (బి ఎల్ వో)లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సహాయపడే విధంగా ప్రత్యేక హెల్ప్ డెస్కలను ప్రారంభించాలని డీబీఆర్ సూచించారు. బిఎల్ఏ నాయకులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఓటర్ల నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని కోరారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేఎల్ఆర్ మరియు డీబీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ చిలుక ఉపేందర్ రెడ్డి రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూన్న గణేష్ నేత టిపిసిసి ప్రచార కమిటీ సభ్యులు సామిడీ గోపాల్ రెడ్డి ఏఎంసీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్ నేత,ముప్పిడి లింగస్వామి గౌడ్,బొడ్డుపల్లి మహేందర్, దుబ్బాక శేఖర్ జ్ఞానేశ్వర్ యాదవ్, రామకృష్ణ గౌడ్,కర్ణాకర్ రెడ్డి,యాదవ రెడ్డి, పగడాల ఎల్లయ్య,గోవర్ధన్ రెడ్డి,మహమ్మద్, సుదర్శన్,నబీ, రఘు ,రాజు,సైదులు స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు






## కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో ఎస్ఐఆర్‌పై సమీక్ష సమావేశం

**మహేశ్వరం జూలై18 (ప్రజాక్షేత్రం):**

కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో శనివారం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి కందుకూరు,మహేశ్వరం మండలాల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. సమావేశానికి కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవుల యాదయ్య మాట్లాడుతూ,ప్రతి ఓటరితో ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపించి,పాత ఓటరు వివరాలు లేదా 2002 ఓటర్ల జాబితా ఆధారంగా ఓటరు వివరాలను సక్రమంగా నవీకరించాలని సూచించారు.మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరి ఎస్ఐఆర్ ఫారాలను పూర్తి చేయాలని అధికారులకు,సంబంధిత సిబ్బందికి సూచించారు.ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ,జుక్కల్ నియోజకవర్గంలో ఇప్పటికే 70 నుంచి 80 శాతం వరకు ఎన్యూమరేషన్ ఫారాల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.అదే విధంగా మహేశ్వరం,కందుకూరు మండలాల్లో కూడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్న బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) మరియు సంబంధిత సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు,మండల నాయకులు,బీఎల్ఓలు,ప్రభుత్వ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



## యువకులకు క్రికెట్ కిట్ల పంపిణీ

- క్రికెట్ కిట్లు అందజేసిన కోనేరు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

**కోటగిరి,జులై 18(ప్రజాక్షేత్రం):**

కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటగిరి మండలంలోని అంబం గల్లీలో యువకులకు క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా కోనేరు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ... కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా యువకులకు టికెట్ కిట్ల పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. యువకులు పిల్లలు నిత్యం ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వారు పేర్కొన్నారు. ప్రతి మనిషి నిత్య జీవితంలో ఆటలను భాగంగా మార్చుకోవాలని వారు సూచించారు. ఆరోగ్యకరమైన జీవితం కోసం ఆటలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కోటగిరి మండలం బిజెపి పార్టీ అధ్యక్షుడు ఏముల నవీన్, రుద్రూర్ మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ నాయకులు పత్తి సతీష్, సీతారాం నాయక్, మాజీ వార్డ్ మెంబర్ దుబాస్ మహేష్, , కప్ప సాయిలు, దుబాస్ మహేష్,దుబాస్ సాయిలు, నల్ల సాయిలు, దుబాస్ గిర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పర్యవేక్షణ లోపం వల్లనే అధికారుల అలసత్వం

- రాష్ట్ర నాయకులు దామోదర్ రెడ్డి మరియు వద్దిరాజు రామచంద్రారావు

**కొత్తగూడ జూలై 18(ప్రజాక్షేత్రం):**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పరిధిలోనీ గురుకుల పాఠశాలలో గత రెండు రోజులుగా జరిగిన సంఘటనల కారణంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించి ఇద్దరు పరిశీలకులను పంపడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు దామోదర్ రెడ్డి మరియు వద్దిరాజు రామచంద్ర రావు పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో జరిగిన సంఘటన పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పర్యవేక్షణ లోపం కారణంగానే స్థానిక కొత్తగూడ మండల పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్( ఈ ఎం ఆర్ ఎస్ ) లో నీటి కొరత తీవ్రంగా ఉందని, పాఠశాల పర్యవేక్షణ కు వచ్చిన రీజనల్ కోఆర్డినేషన్ ఆఫీసర్ రత్నకుమారి గారిని విద్యార్థులు ప్రశ్నించగా కోపోద్రికురాలైన( ఆర్ సి ఓ ) పొంతన లేని సమాధానాలతో విద్యార్థులను నానా దుర్భాషలాడుతూ నన్ను ప్రశ్నిస్తే చెప్పుతో కొడతా అంటూ నీచంగా మాట్లాడటం శోచనీయమన్నారు. అంతేకాకుండా స్థానిక మంత్రి సీతక్క వెంటనే స్పందించి ఈ ఘటనకు కారణమైన ఆర్ సి ఓ సస్పెండ్ చేయాలని లేని యెడల బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నీటి కొరతను తీర్చి విద్యార్థులకు అండగా నిలవాలని అన్నారు అదేవిధంగా ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను సందర్శించి స్కూల్ ప్రారంభం కాకముందే చేయాల్సినటువంటి మరమ్మత్తులను పాఠశాల ప్రారంభమయ్యాక ప్రత్యేకంగా విద్యార్థులను ఇంటికి పంపించి మరమ్మత్తులు చేయించడం అధికారుల అలసత్వానికి నిదర్శనం అని అన్నారు

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాదగిరి మురళి, ప్రధాన కార్యదర్శి బోనాల ప్రవీణ్ చారి, వజ్జ రవి, జిల్లా కార్యదర్శి తోటకూరి మధు, రాష్ట్ర వనబందు సెల్ కన్వీనర్ బోడ నవీన్ నాయక్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు స్వామి నాయక్, జిల్లా నాయకులు వాసం మునీందర్,కొట్టె శ్రీనివాస్, హరిలాల్,రూప్లా నాయక్, చెవ్వ రామచందర్ తదితరులు పాల్గొన్నారు



## నైతిక విలువలతోనే ఉన్నత శిఖరాలకు సాంకేతిక మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి

- మైక్రోసాఫ్ట్ లీడర్ సునీల్ సత్యవోలు పిలుపు
- వైభవంగా కేజీఆర్‌సీఈటీ 15వ గ్రాడ్యుయేషన్ డే
- పట్టభద్రులకు సర్టిఫికెట్ల అందజేత.. స్టార్టప్ నిర్వాహకులకు సత్కారం

**మొయినాబాద్,జులై 18(ప్రజాక్షేత్రం):**

నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు, నిరంతర అభ్యాసం మరియు మార్పులకు అనుగుణంగా మలుచుకునే సామర్థ్యమే ప్రతి విద్యార్థి విజయానికి కీలకమని మైక్రోసాఫ్ట్ సొల్యూషన్స్ టెక్నాలజీ & ప్రొడక్ట్ లీడర్ సునీల్ సత్యవోలు పేర్కొన్నారు. కేజీ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ 15వ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంకేతిక రంగంలో వస్తున్న వేగవంతమైన మార్పులను అందిపుచ్చుకుంటూ, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకునే దృక్పథాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను నైతిక విలువలతో జోడించి ముందుకు సాగినప్పుడే సమాజంలో బాధ్యతాయుతమైన నాయకులుగా ఎదుగుతారని ఆయన ఆకాంక్షించారు.డా. ఎస్.సాయి సత్యనారాయణ రెడ్డి,డైరెక్టర్ రోహిత్,ప్రొఫెసర్ ఎల్.గోవర్ధన్ రెడ్డి,అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.






## ఓటు హక్కును కాపాడుకోండి..

- ఫారం లు తప్పనిసరిగా సమర్పించండి
- 18, 19, 21 వార్డుల్లో ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన నిరంజన్ బాబా

**వనపర్తి,జూలై 18 (ప్రజాక్షేత్రం):**

వనపర్తి పట్టణంలోని 18, 19, 21 వార్డుల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి, వార్డుల ఇన్‌చార్జి ఎండి నిరంజన్ బాబా శనివారం పరిశీలించారు. వార్డుల లో ఇంటింటికీ పంపిణీ చేసిన ఓటరు సవరణ ఫారం స్వీకరణ, నింపడం, తిరిగి సమర్పణ ప్రక్రియపై ఆయన ఆరా తీశారు.

ఫారం తీసుకున్న ప్రతి కుటుంబం వాటిని పూర్తిగా, సరైన వివరాలతో నింపి నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులకు తప్పనిసరిగా అందజేయాలని ఆయన సూచించారు. వివరాల లో పొరపాట్లు లేకుండా ఫారం సమర్పిస్తేనే ఓటర్ల జాబితాలో పేర్లు సక్రమంగా నమోదు అవుతాయని చెప్పారు.

ఈ సందర్భంగా నిరంజన్ బాబా మాట్లాడుతూ, ఓటు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. నిర్లక్ష్యం కారణంగా ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోవద్దని, ఫామ్స్ తీసు



కున్న ప్రతి ఒక్కరూ వాటిని తప్పనిసరిగా తిరిగి సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

కొత్తగా ఓటు హక్కుకు అర్హత పొందిన యువత వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని, చిరునామా మార్పు, పేర్ల సవరణ, ఇతర వివరాల్లో మార్పులు ఉన్నవారు కూడా ఈ ప్రత్యేక సవరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వార్డుల్లో ప్రత్యేక సవరణ కార్యక్రమం సజావుగా సాగుతున్న తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు పూర్తి సహకారం అందించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు.

"ఓటు మన హక్కు.. ప్రజాస్వామ్యానికి పునాది. ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకుని, సవరణలు పూర్తి చేసి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలి" అని ఎండి నిరంజన్ బాబా పిలుపునిచ్చారు.



## అంగన్వాడీ పాఠశాలను తనిఖీ చేసి పరిశుభ్రతపై అరా

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించిన మండల ప్రత్యేక అధికారిని పూర్ణిమ

**జహీరాబాద్ జూలై 18 (ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నూతనంగా నిర్మాణంలో ఉన్న ఇదిరమ్మ ఇంటి నిర్మాణం పనులను శనివారం నాడు మండల ప్రత్యేక అధికారి పూర్ణిమ చిరాగ్ పల్లి గ్రామన్ని సందర్శించి ఆకస్మిక తనిఖీలు చేశారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను మరియు అంగన్వాడి పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి శానిటేషన్ మరియు త్రాగునీరు మరియు మధ్యాహ్న భోజనాలపై సమీక్షించడం జరిగింది. వారి ఆకస్మిక తనిఖీలో మండలం పరిషద్ అభివృద్ధి అధికారి మహేందర్ కూడా ఉన్నారు. తర్వాత మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మండలంలో అమలవుతున్న వివిధ రకాల కార్యక్రమాలను అధికారుల నుంచి వివరాలు సేకరించడం జరిగింది.ఈ సమావేశంలో తాసిల్దార్ దశరథ్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ ప్రవీణ్ కుమార్ ఎంఈఓఏఓ ఏ పీ ఆర్ మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**కోటగిరి,జులై 18( ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండలంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్ ఆధ్వర్యంలో శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగాధర్ దేశాయ్ మాట్లాడుతూ... పేద ప్రజల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా కార్పొరేట్ వైద్యం పొందిన అనంతరం ప్రభుత్వం వారికి అండగా ఉంటూ ఆసుపత్రి ఖర్చులను లో కొంత భాగాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ రూపంలో వారికి తిరిగి అందజేస్తుండడం గొప్ప విషయం అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కోటగిరి మండలం యాదార్ పూర్ గ్రామంలో ఒకరికి 20వేలు మరొకరికి 35 వేలు , ఎక్లాస్పూర్ గ్రామంలో ఒకరికి 60 వేల రూపాయలు, పోతంగల్ మండలం జల్లాపల్లిలో ఒకరికి 60 వేల రూ. ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనంద్, యాద్గార్ పూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాదు, నాయకులు చిన్న సాయన్న, మున్వర్,అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల కమిటీ మాట నిలబెట్టుకోవాలి

- సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు

**వలిగొండ జులై 18(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించడానికి ఉద్యమకారుల గుర్తింపు కమిటీ శుక్రవారం జరిగిన సమావేశంలో 26 జనవరి 2027 లోగా పూర్తి చేసి 26 జనవరి 2027 నాడు ఉద్యమకారులకు ప్రభుత్వం చే అధికారికంగా ఘనంగా సన్మానం చేయడం జరుగుతుందని చెప్పడం జరిగిందని వెంటనే కాలయాపన చేయకుండా ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని మలిదశ ఉద్యమకారుడు టియుజెఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంఘీశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం దగ్గర స్పష్టమైన సమాచారం ఉన్నందున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు జైలు శాఖ పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన అన్నారు.



# సాధన సొసైటీ, శాంతి నిలయాలను సందర్శన

- **మండల న్యాయ సేవల కమిటీ ఛైర్మన్ జి.సబిత**

**వలిగొండ జులై 18(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ లోని సాధన సొసైటీ, శాంతి నిలయం ను రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి జి.సబితా ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల నిర్వహణ, పరిశుభ్రత, నివాస సౌకర్యాలు, ఆహార ఏర్పాట్లు, వైద్య సేవలు, మౌలిక వసతులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే అక్కడ నివసిస్తున్న వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, వారికి అందుతున్న సంరక్షణ, సేవల గురించి సంస్థల నిర్వాహకులతో మాట్లాడారు. సంస్థల్లో నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, పరిశుభ్రమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించేందుకు నిరంతరం కృషి చేయాలని నిర్వాహకులకు సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు, నిరాశ్రయులు, వృద్ధుల సంక్షేమం పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి సహకరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం సంస్థల నిర్వాహకులు అందిస్తున్న సేవలను అభినందిస్తూ,భవిష్యత్తులో కూడా ఇదే సేవాభావంతో కొనసాగించాలని ఆకాంక్షించారు.



# ప్రతి ఓటర్ ఓటు హక్కును కాపాడుకోవాలి

- **ఎస్ఐఆర్ ఫామ్ ఓటర్లందరు తప్పకుండా నింపి ఇవ్వాలి**
- **ఎల్ నినో దృష్ట్యా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలి**
- **ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఫసల్ బీమా పథకం అమలు చేయాలి**
- **బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండల లక్ష్మనారాయణ**

**కోటగిరి,జులై18 (ప్రజాక్షేత్రం):**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ప్రజలందరు భాగస్వామ్యమై తమ అమూల్యమైన ఓటు హక్కును కాపాడుకోవాలని బిజెపి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే,బాన్సువాడ అసెంబ్లీ ఇంచార్జ్ ఎండల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.శనివారం పోతంగల్ మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి బిజెపి పార్టీ కార్యవర్గ సభ్యుల ముఖ్య సమావేశం లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ....బిజెపి పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ ఆదేశాల మేరకు రాష్ట్ర, జిల్లాల,నియోజకవర్గాల,మండలాల వారిగా బీజేపీ కార్యవర్గ సమావేశాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా నేడు పోతంగల్ మండల బిజెపి పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యవర్గ సమావేశాలు ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పార్టీ కార్యకర్తలు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని ఓటర్లను జాగృతం చేసి వారి సందేహాలను నివృత్తి చేయా లని ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ఫాం నింపి బిఎల్ఓ లకు ఇచ్చేందుకు కార్యకర్తలు ప్రత్యేక చొరవ చూపాలని చెప్పడం జరిగిందన్నారు. ప్రజలందరు ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న సర్ ప్రక్రియలో పాల్గొని ఎన్యూమరేషన్ ఫారాలను తప్పులు లేకుండా పూర్తిచేసి ఓటును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎల్ నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు పండించాలని కోరారు.రైతులందరు ప్రత్యామ్నాయ పంటలను వేసి కరువు నుండి బయటపడాలని సూచించారు.

కరువు పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అనువైన నిర్ణయాలు చేసేవిధంగా ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలుచేసి రైతును భాగస్వామ్యం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పోతంగల్ మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు భజరంగ్ హనుమాన్లు,ఓబిసి మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మక్కయ్య,బాన్సువాడ నియోజక ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,బాన్సువాడ బీఎల్ఏ అసెంబ్లీ ఇంచార్జ్ సుధాకర్ గౌడ్, కోటగిరి మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు ఏముల నవీన్, పోతంగల్ మండల బీజేపీ పార్టీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి విజయ్,శంకర్,పోతంగల్ మండల మైనార్టీ మోర్చ మండల అధ్యక్షులు నైముద్దీన్, కోటగిరి మండల బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి సాయిగౌడ్,సీనియర్ నాయకులు ఓమన్న పటేల్,మక్కన్న,సంతోష్ పటేల్,వీరేశం, మారుతి పటేల్,సాయిప్రసాద్,వినోద్,రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటు హక్కును పరిరక్షించాలి..

- **రాష్ట్రంలో ఓటు చోరీ జరగనివ్వొద్దు**
- **సర్ ప్రక్రియపై బీఎల్ఏ-2లతో మంత్రి జూపల్లి సమీక్ష**
- **డిజిటలైజేషన్ ను వేగవంతం చేయాలి**
- **జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి**
- **వీపనగండ్ల, పానుగల్, చిన్నంబావి మండలాల్లో సమావేశాలు**

**వనపర్తి,జూలై 18 (ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, ఇతర రాష్ట్రాల్లో జరిగినట్లు తెలంగాణలో ఓటు చోరీకి తావులేకుండా చూడాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రతి అర్హుడి ఓటు నమోదు పూర్తయ్యేలా అధికారులు, బీఎల్ఏ2లు, బీఎల్వోలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం వనపర్తి జిల్లా వీపనగండ్ల, పానుగల్, చిన్నంబావి మండల కేంద్రాల్లో రైతు వేదికల్లో నిర్వహించిన సర్ ప్రక్రియ సమీక్ష సమావేశాలకు మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి సిద్ధేశ్వర్, వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటు హక్కు ద్వారానే ప్రజలు ప్రభుత్వాలను ఎన్నుకుంటారని, సంక్షేమ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరాలంటే ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఓటు చోరీ ఆరోపణలపై దేశవ్యాప్తంగా చర్చ జరిగిందని, తెలంగాణలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండాలి**

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి సిద్ధేశ్వర్ మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని కోరారు. బీఎల్ఏ2లు, బీఎల్వోలు ప్రజలకు అవగాహన కల్పించి ఎన్యూమరేషన్ ఫారాల భర్తీలో సహకరించాలని సూచించారు.

**డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి**

డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి మాట్లాడుతూ, బీఎల్వోలు, బీఎల్ఏ2లు సమన్వయంతో పనిచేసి సర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాలు, మండలాల వారీగా డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షించిన ఆయన, 80 నుంచి 90 శాతం పని పూర్తి చేసిన బీఎల్వోలు, బీఎల్ఏ2లను అభినందించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.సమీక్ష సమావేశాల లో ఎమ్మార్వోలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు, బీఎల్ఏ2లు, సర్పంచులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, యూత్ కాంగ్రెస్ నాయకుడు పాండు సాగర్, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# యూనిఫామ్ స్టిచ్చింగ్ పనులు వేగవంతం చేయాలి

- **59 ప్రభుత్వ పాఠశాలల యూనిఫారం క్లాత్ స్టిచ్చింగ్ ఏజెన్సీలకు అప్పగింత**
- **ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు త్వరలో కొత్త యూనిఫామ్**
- **పెద్దేముల్ మండల ఎంఈఓ నర్సింగ్ రావు**

**పెద్దేముల్,జులై 18 (ప్రజాక్షేత్రం):**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల యూనిఫామ్ కోసం ఇచ్చిన యూనిఫామ్ క్లాత్ ను స్టిచ్చింగ్ ఏజెన్సీల ప్రతినిధులు త్వరితగతిన కుట్టింపు పనులను పూర్తి చేసి ప్రభుత్వ పాఠశాలలకు అందజేయాలని పెద్దేముల్ మండల ఎంఈఓ నర్సింగ్ రావు సూచించారు.శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలో మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన విద్యార్థుల యూనిఫామ్ క్లాత్ ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో స్టిచ్చింగ్(కుట్టింపు) నిమిత్తం ఏపీఎంకు అప్పగించారు.ఈ సందర్భంగా ఎంఈఓ నర్సింగ్ రావు మాట్లాడుతూ... పెద్దేముల్ మండలంలోని సుమారు 59 ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం నుండి యూనిఫామ్ క్లాత్ సరఫరా కావడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫామ్ క్లాత్ ను శనివారం ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో మండల ఏపీఎంకు,స్టిచ్చింగ్ ఏజెన్సీల ప్రతినిధులకు అందించడం జరిగిందన్నారు. స్టిచ్చింగ్ ఏజెన్సీల ప్రతినిధులు యూనిఫామ్ కుట్టింపు (స్టిచ్చింగ్) పనులను త్వరితగతిన పూర్తి చేసి వీలైనంత త్వరగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదే విధంగా యూనిఫామ్ పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి విద్యార్థులకు యూనిఫామ్ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల మహిళా సమాఖ్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.





# జిల్లా భద్రతకు స్పెషల్ బ్రాంచే వెన్నెముక

- **సమాచార సేకరణలో అప్రమత్తతతో నేర నియంత్రణ సాధ్యం**
- **ఎస్పీ సునిత రెడ్డి**
- **పాస్‌పోర్ట్, ఉద్యోగ ధ్రువీకరణ సేవలను మరింత వేగవంతం చేయాలని ఆదేశం**

**వనపర్తి,జూలై 18 (ప్రజాక్షేత్రం):**

జిల్లా పోలీసు వ్యవస్థలో స్పెషల్ బ్రాంచ్ కీలక పాత్ర పోషిస్తోందని, క్షేత్రస్థాయిలో సేకరించే సమాచారమే జిల్లా భద్రతకు బలమైన కవచమని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా స్పెషల్ బ్రాంచ్ అధికారులు క్రమశిక్షణ, సమన్వయం, సేవాభావంతో పనిచేయాలని సూచించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. నేరాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవడంలో స్పెషల్ బ్రాంచ్ అందించే సమాచారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. అదే అప్రమత్తతతో సమాచార సేకరణ కొనసాగించి నేర నియంత్రణకు సమర్థవంతంగా తోడ్పడాలని ఆదేశించారు. పాస్‌పోర్ట్ ధ్రువీకరణ, ఉద్యోగ ధ్రువీకరణలు, పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్ల జారీ వంటి సేవలను ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా అందించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులో పూర్తి చేయడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల నమ్మకం మరింత బలోపేతం అవుతుందన్నారు.

ఇతర పోలీసు విభాగాలతో సమన్వయం పెంచుకుంటూ సమాచార మార్పిడి సమర్థవంతంగా నిర్వహించాలని, స్పెషల్ బ్రాంచ్ పనితీరు ఇప్పటికే ప్రశంసనీయంగా ఉందని, ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్,ఎస్సైలు మంజునాథ్ రెడ్డి,నరేష్,పర్వతాలు తదితరులు,స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

# చేనేత సమస్యల పరిష్కారానికి కృషి

- **ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**సంస్థాన్ నారాయణపురం, జులై 18(ప్రజాక్షేత్రం):**

ఇటీవల జరిగిన చేనేత సహకార సంఘం ఎన్నికలలో నారాయణపురం చేనేత సహకార సంఘం అధ్యక్షునిగా గెలుపొంది బాధ్యతలు చేపట్టిన చిలుకూరి శ్రీనివాస్ శనివారం మునుగోడు నియోజకవర్గ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కార్మికులకు పేరుకుపోయిన సమస్యలను త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసి వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీని అభినందించారు ఈ కార్యక్రమంలో నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి మాజీ ఎంపీపీలు గుత్త ఉమా ప్రేమ్చందర్ రెడ్డి బుజ్జి నాయక్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కరెంటుతు శ్రీను నాయక్ కాంగ్రెస్ నాయకులు దోనూరి జయపాల్ రెడ్డి మందుగుల బాలకృష్ణ మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నర్సింహ రాచకొండ రమేష్ బాబు చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు పగిడిమర్రి విష్ణు కార్యదర్శి దోర్నాల అంజయ్య కోశాధికారి సంగిశెట్టి అనంత, డైరెక్టర్స్ మేకని యాదగిరి చేనేత నాయకులు చెరుపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీ సిబ్బందితో రాజకీయాలు చేయడం తగదు

- **అల్లందేవిచెరువు గ్రామపంచాయతీ సిబ్బంది**

**సంస్థాన్ నారాయణపురం జులై 18(ప్రజాక్షేత్రం):**

అల్లందేవిచెరువు గ్రామపంచాయతీ సిబ్బందితో రాజకీయాలు చేయడం తగదని గ్రామపంచాయతీ సిబ్బంది ఏర్పుల నాగేష్, ఏర్పుల గాలయ్య, ముక్కర్ల బిక్షపతి పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ, నిన్న గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా అల్లందేవిచెరువు గ్రామంతో పాటు క్రీడా ప్రాంగణాన్ని కూడా పూర్తిగా శుభ్రం చేసిన అనంతరం, మధ్యాహ్న భోజన విరామం కోసం ఇంటికి వెళ్లామని తెలిపారు. ఆ సమయంలో గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేయలేదని, అయినప్పటికీ తాళం వేసినట్లు అసత్య ప్రచారం చేస్తూ బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఏర్పుల రాజేష్ పత్రికలకు ప్రకటనలు ఇవ్వడం పూర్తిగా ఖండిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్యదర్శి గత వారం రోజులుగా కలెక్టర్ కార్యాలయానికి అటాచ్ కావడంతో గ్రామానికి కార్యదర్శి లేరని, అలాగే సర్పంచ్ కూడా గ్రామపంచాయతీ పనుల నిమిత్తం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారని వివరించారు. ఈ పరిస్థితులను తెలుసుకోకుండా గ్రామపంచాయతీకి తాళం వేసినట్లు తప్పుడు ఆరోపణలు చేయడం వల్ల ప్రజల్లో అపోహలు ఏర్పడటమే కాకుండా పంచాయతీ సిబ్బంది ప్రతిష్ఠ దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బంది విధుల్లో భాగంగా తరచూ ఫీల్డ్ వర్క్‌లో ఉండాల్సి వస్తుందని, మధ్యాహ్న భోజన సమయంలో కొద్దిసేపు కార్యాలయంలో లేకపోవడం సహజమేనని పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయ ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు.అదే విధంగా, గతంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్ ఉన్న సమయంలో కూడా ఇదే విధంగా ఫీల్డ్ వర్క్ నిర్వహించేవాళ్లమని, అయితే గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసిన సందర్భం ఎప్పుడూ లేదని స్పష్టం చేశారు. ఇకపై వాస్తవాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు, తప్పుడు పత్రికా ప్రకటనలు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పంచాయతీ సిబ్బందిని రాజకీయాల్లోకి లాగి ఇబ్బందులకు గురిచేయవద్దని ఏర్పుల నాగేష్, ఏర్పుల గాలయ్య, ముక్కర్ల బిక్షపతి విజ్ఞప్తి చేశారు.



# వనదుర్గ సేవలో హీరో మంచు విష్ణు

**పాపన్నపేట, జులై 18(ప్రజాక్షేత్రం):**



మెదక్ జిల్లాలో పాపన్నపేట్ మండలం నాగ్సన్‌పల్లి గ్రామంలోప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వనదుర్గ భవానీ మాతను సినీ హీరో మంచు విష్ణు దర్శించుకున్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా జిల్లా యంత్రాంగం ఆహ్వానం మేరకు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు గాను ఆయన శనివారం మెదక్ జిల్లా పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా పాపన్నపేట మండల పరిధిలోని ఏడుపాయల వనదుర్గ భవానీ ఆలయాన్ని ఆయన సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణం మరియు ప్రాంత పరిసరాలను జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ విష్ణుకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా ట్రినిటీ హైస్కూల్లో పింక్ డే సెలబ్రేషన్స్ వేడుకలు

**చౌటుప్పల్ జూలై 18(ప్రజాక్షేత్రం):**

చౌటుప్పల్ మున్సిపాలిటీ పట్టణంలో ఉన్న ట్రినిటీ హైస్కూల్లో ఈరోజు పింక్ డే సెలబ్రేషన్స్ ఘనంగా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రినిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కం డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల విచ్చేసి చిన్నారి విద్యార్థులకు పింక్ కలర్ యొక్క ఆవశ్యకతను వివరించారు. అలాగే ఇంద్రధనస్సు మాదిరిగా వివిధ రకాల కలర్స్ ను చిన్నారి విద్యార్థులకు ప్రదర్శన చేశారు మరియు రాష్ట్రంలో వర్షాలు కురువక కరువు పరిస్థితులు ఉన్నందున విద్యార్థుల చేత కప్పల పెళ్లి చేశారు అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతుల ఇంట సిరులు ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ హై స్కూల్ చైర్మన్ కె వి బి కృష్ణారావు ఉపాధ్యాయులు స్వప్న షాను ఉమారాణి అనిత వరలక్ష్మి మీనాక్షి మౌనిక శ్రావణి అనూష శోభ తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడదకు చెక్

- **మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**

**చౌటుప్పల్ జూలై 18(ప్రజాక్షేత్రం):**

చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో గత కొన్ని రోజులుగా తీవ్రంగా ఉన్న కోతుల బెడదను నివారించేందుకు మున్సిపల్ చైర్ పర్సన్ ఆదేశాల మేరకు మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ప్రత్యేక చొరవతో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుండి ప్రత్యేక కోతులు పట్టే నిపుణుల బృందాన్ని (టీమ్‌ను) రప్పించారు. ఈ బృందం చౌటుప్పల్ పట్టణంలో విద్యానగర్ పరిసరాలలో మరియు హెచ్ పి గ్యాస్ సమీపంలో, కచ్చీరు ప్రాంతం వద్ద ప్రత్యేక బోనులను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో శనివారం ఉదయం రాజమండ్రి బృందం సుమారు 211 కోతులను బంధించారు. చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు పట్టుబడిన ఈ కోతులను సురక్షితంగా ములుగు జిల్లాలోని మాటు కొండూరు అటవీ ప్రాంతంలో (ఫారెస్ట్) వదిలివేయడానికి తరలించారు. పట్టణ ప్రజల రక్షణ, సౌకర్యమే మా ప్రథమ ప్రాధాన్యత. గత కొన్నాళ్లుగా కోతుల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. మున్సిపాలిటీని కోతుల బెడద నుండి విముక్తం చేసేందుకు ఈ చర్యలు కొనసాగుతాయి అని చైర్‌పర్సన్ ముగ్గుదాల పావని రమేష్ గౌడ్ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాక చిరంజీవి,హన్ను మహమ్మద్, బద్రి గాలయ్య, చింతల ఉమామహేశ్వరి, నాయకులు చింతల సాయిలు, బత్తుల దాసు, మరియు మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని పర్యవేక్షించారు. కోతుల బెడద నుండి ఉపశమనం కలిగించేందుకు చొరవ తీసుకున్న చైర్‌పర్సన్ కు, పాలకవర్గానికి పట్టణ ప్రజలు సంతోషించి, కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఇంకా చాలా కోతులు ఉన్నాయని పట్టణం మొత్తం కోతుల బెడద నుంచి విముక్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.



# రైతాంగానికి అండగా ఎమ్మెల్యే రామారావు పటేల్

**నిర్మల్ జిల్లా జూలై 18(ప్రజాక్షేత్రం):**

బాసర మండల పరిధిలో గత 25 రోజులుగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. వానలు లేక చేతికొచ్చిన పంటలు కళ్ల ముందే ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో స్థానిక రైతాంగం తీవ్ర ఆందోళనలో మునిగిపోయింది. పెట్టుబడులు కూడా దక్కవని ఆవేదన చెందుతున్న తరుణంలో, రైతులంతా కలిసి ఈ క్లిష్ట పరిస్థితిని స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లారు.రైతుల విజ్ఞప్తిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే.. సంబంధిత అధికారులతో అత్యవసరంగా సమీక్ష నిర్వహించారు. గోదావరి నదిపై ఉన్న ఎత్తిపోతల పథకం ద్వారా వ్యవసాయ కాలువలకు సాగునీటిని తక్షణమే విడుదల చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే చొరవతో కాలువల ద్వారా నీరు చేరడంతో దాదాపు 2,500 ఎకరాలకు పైగా సాగునీరు అందుబాటులోకి వచ్చింది.ఎండిపోతున్న పంటలకు ఈ నీరు జీవం పోసినట్లయిందని, తమ శ్రమ వృథా కాకుండా కాపాడినందుకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో స్పందించి తమను ఆర్థిక నష్టం నుండి ఆదుకున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు మండల రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది చేసే సత్తా ఉన్న ప్రభుత్వం

- **తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మంచి కమిట్ మెంట్ ఉన్న నాయకుడు**
- **- రూ.290 కోట్ల రూపాయలతో హ్యామ్ రహదారి అభివృద్ధి పనులకు శంఖుస్థాపన**
- **శంఖుస్థాపనలు చేసిన రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, తదితరులు**
- **తాండూరు నియోజకవర్గ రోడ్లకు అత్యధిక నిధులు మంజూరు చేశాం-మంత్రులు**
- **11 వేల కోట్ల రాష్ట్రంలో రోడ్ల నిర్మాణాలు, 70 వేల మందికి ఉద్యోగ అవకాశాలు**
- **ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అభివృద్ధి పనులు మంజూరు చేయించడంలో పట్టువదలని విక్రమార్కుడు**
- **రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**
- **తాండూరును అభివృద్ధి చేయడమే నా లక్ష్యం-తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**పెద్దేముల్, జులై 18(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ ప్రభుత్వం అంటే సత్తా ఉన్న ప్రభుత్వమని, ప్రజలకు చెప్పింది చేసి చూపించే ప్రభుత్వమని, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చొరవతో వందల కోట్ల రూపాయల నిధులతో తాండూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం తాండూరు నియోజకవర్గంలోని అంతారం గ్రామ పరిధిలో రూ.290 కోట్ల విలువైన హ్యామ్ రహదారి అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవేళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, చేవేళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ దీపక్ తివారిలతో కలిసి శంఖుస్థాపన చేశారు.అనంతరం కందనెల్లి జీపీఆర్ గార్డెన్లో నిర్వహించిన "ప్రగతి సభ" లో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ.....

ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తూనే అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని, రూ.290 కోట్ల వ్యయంతో ప్రధాన రహదారులు నిర్మించేందుకు శంఖుస్థాపన చేసుకోవడం జరిగిందని అన్నారు. రవాణా వ్యవస్థను అభివృద్ధి పరుస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు.కాగ్నా నదిలో తాండూరు మురుగు నీరు కలువకుండా రూ.30 కోట్ల రూపాయలు మంజూరు చేసి పనులు మొదలు పెట్టడం జరిగిందన్నారు. తాండూరులో 571 మంది అర్హులైన నిరుపేదలకు పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్లు కేటాయించామని, రాష్ట్రంలో 11 వేల కోట్ల రూపాయాలతో రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. గ్రూప్1, గ్రూప్ 2 తదితర పరీక్షలు నిర్వహించి సుమారు 70 వేల మందికి రెండున్నర ఏండ్లలో ఉద్యోగాలు ఇచ్చామన్నారు. నిరుపేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పథకం తీసుకొచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, సత్తా ఉన్న ప్రభుత్వమని, చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని అన్నారు. తాండూరు ప్రజలు కమిట్మెంట్తో పనిచేసే ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..తాండూరు నియోజకవర్గానికి రోడ్ల కోసం రూ.290 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని, రోడ్డు రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉంటే పరిశ్రమలు, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయన్నారు. మంజూరు చేసిన నిధులతో వెంటనే పనులు చేపడతామని అన్నారు. ప్రజా పాలనలో 30 మాసాల్లో ఎన్నో రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లకు రూ.5 లక్షలు, 500 లకే గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం జరిగిందన్నారు. రైతు భరోసా కింద 9 రోజుల్లో రూ.900 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలకు జమ చేశామని అన్నారు. విద్యాభివృద్ధిలో భాగంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు మంజూరు చేశామని, కోర్టు కేసు పరిష్కారం అయిన వెంటనే రూ.94 కోట్ల వ్యయంతో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను 18 వారాల్లో చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు.ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ....ప్రభుత్వం పేదల అభ్యున్నతికి కృషి చేస్తూ ఎన్నో రకాల సంక్షేమ పథకాలను దశలవారీగా అమలు పరుస్తుందని, వికారాబాద్ జిల్లాకు రోడ్ల అభివృద్ధికి రూ. 700 వందల కోట్ల నుండి రూ.800 వందల కోట్ల రూపాయలను కేటాయిస్తే అందులో తాండూరు నియోజకవర్గానికి సుమారు రూ.345 కోట్ల రూపాయలు మంజూరు కావడం జరిగిందన్నారు. కర్ణాటక సరిహద్దు రోడ్లకు కూడా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ......తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు తీసుకురావడం జరిగిందని, సీఆర్ఆర్ కిందా రూ.100 కోట్ల రూపాయలతో ప్రధాన రోడ్లు,గ్రామాలకు అనుసంధాన రోడ్లు, పెద్దేముల్ మండలానికి రూ.30 కోట్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఒక సంవత్సర కాలంలో తాండూరులో అన్ని రోడ్లు పూర్తి చేస్తామన్నారు. ఒక కమిట్మెంట్ తో పని చేస్తూ ముందుకు పోతున్నామన్నారు. కోట్ పల్లి ప్రాజెక్టుకు రూ.90 కోట్లు మంజూరు చేయించి 14 గ్రామాలకు 9,400 ఎకరాలకు సాగు నీరు అందించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం చెప్పింది చేసుకొంటూ ముందుకు పోతున్నామన్నారు. యాలాల మండలం దౌలాపూర్లో రూ.200 కోట్ల ఇంటిగ్రేటెడ్ స్కూల్, జుంటుపల్లి ప్రాజెక్టుకు నిధులు, తాండూరులో రూ.75 కోట్ల రూపాయలతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్,బషీరాబాద్లో 30 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టి తాండూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. తాండూరు నియోజకవర్గంలో గత సర్పంచ్ ఎన్నికల్లో ఉన్న 155 గ్రామ పంచాయతీలో 120 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ సర్పంచులు గెలుపొందారని, 26 స్థానాల్లో ఏకగ్రీవం కావడం జరిగిందన్నారు. దీంతో మరింత బాధ్యత తనపై పెరిగిందని అన్నారు. బైపాస్ రోడ్డు భూనిర్వాసితులకు రూ.25 కోట్ల 18 లక్షలు చెక్కులను కూడా ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత, చేవేళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,ఎస్పీ స్నేహా మెహ్రా, అదనపు కలెక్టర్లు ఉమాశంకర ప్రసాద్, వెంకట చారి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, ఆర్డీఓ అనిత, డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, తాండూరు నియోజకవర్గం సర్కన్వీనర్ కరణం పురుషోత్తం రావు,పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్ రెడ్డి,తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మెన్ అబ్దుల్ రజాక్, కందనెల్లి సర్పంచ్ భూమే యాదమ్మ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నారాయణ గౌడ్, ఉపాధ్యక్షుడు ఆనంద్ నాయక్, మండల తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్, ఎంపీడీఓ తిరుమల స్వామి, ఎంపీఓ రతన సింగ్,ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ చైర్మెన్లు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడుల బలోపేతానికి అందరూ తోడ్పడాలి

- **మన్మర్రి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా తల్లిదండ్రుల– ఉపాధ్యాయల సమావేశం**

**షాబాద్ జులై 18(ప్రజాక్షేత్రం):**

షాబాద్ మండలం మన్మర్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా పురోగతి, హాజరు శాతం, పరిశుభ్రత, క్రమశిక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పాఠశాల అభివృద్ధిపై తల్లిదండ్రులతో సమగ్రంగా చర్చించారు. ప్రతి విద్యార్థి రోజూ పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఇంటి వద్ద చదువుకు అనుకూల వాతావరణం కల్పించాలని ప్రధానోపాధ్యాయుడు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ విద్యాసంవత్సరంలో 28 మంది కొత్త విద్యార్థులు చేరడంతో పాఠశాల విద్యార్థుల సంఖ్య 59కు చేరిందని తెలిపారు. ఇందుకు సహకరించిన గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. "మిషన్-60 ప్లస్" కార్యక్రమం కొనసాగుతుందని, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల భారం భరించలేని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి దాతలు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో గ్రామ ఉపసర్పంచ్ బేగరి శంకరయ్య, ఏఏపీసీ చైర్మన్ బాలమణి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, వార్డు సభ్యులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# భూ భారతి పోర్టల్‌తో భూ సేవలు మరింత పారదర్శకం

**శంకర్ పల్లి జులై 18(ప్రజాక్షేత్రం):**

భూ భారతి పోర్టల్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పార్థసింహారెడ్డి, మండల తహసీల్దార్ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పోర్టల్ ద్వారా పౌరులకు అందుబాటులో ఉన్న వివిధ భూ సేవలను నిర్ణీత గడువులో పారదర్శకంగా అందించే విధానాన్ని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పోర్టల్ వినియోగం, సేవల అమలు తీరుపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ మండలాల తహసీల్దార్లతో పాటు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నుంచి వచ్చిన ప్రతినిధుల బృందం హాజరై, భూ భారతి పోర్టల్ అమలు విధానం, పౌర సేవలకు సంబంధించిన అంశాలపై అవగాహన పొందారు.



# భైంసాలో ఘనంగా అన్నాబావు సాఠే వర్ధంతి వేడుకలు

**నిర్మల్ జిల్లా జూలై 18(ప్రజాక్షేత్రం):**

స్థానిక భైంసా పట్టణంలోని జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో అన్నాబావు సాఠే వర్ధంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పాటిల్ ముందుగా అన్నాబావు సాఠే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మోహన్ రావు పాటిల్ మాట్లాడుతూ.. అన్నాబావు సాఠే ఆశయాలు మహోన్నతమైనవని కొనియాడారు. సమాజానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని, అవి ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆయన చూపిన బాటలోనే అందరూ పయనించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్ పాపిన్వర్, రామకృష్ణ కసారి, బీజేపీ ప్రతినిధులు, లైబ్రరీ అభ్యర్థులు మరియు స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నాబావు సాఠేకు ఘన నివాళులు అర్పించారు.




# దేగాం గ్రామపంచాయతీలో అట్టహాసంగా జల సిరి' గ్రామసభ

**నిర్మల్ జిల్లా జూలై 18(ప్రజాక్షేత్రం):**

భైంసా మండలం దేగాం గ్రామ పంచాయతీలో 'జల సిరి' గ్రామసభను అత్యంత ఘనంగా మరియు అట్టహాసంగా నిర్వహించారు. ఈ విశేష గ్రామసభ కార్యక్రమానికి దేగాం గ్రామ సర్పంచ్ సిరం సుష్మారెడ్డి అధ్యక్షత వహించారు. సభ ప్రారంభమైన అనంతరం గ్రామంలోని ప్రస్తుత నీటి వనరుల పరిస్థితిపై మరియు భవిష్యత్తు అవసరాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ముఖ్యంగా ఈ సదస్సులో భూగర్భ జలాల మట్టాన్ని ఏ విధంగా పెంపొందించుకోవాలి, రాబోయే వర్షపు నీటిని వృథా పోనివ్వకుండా ఇంకుడు గుంతలు మరియు ఇతర పద్ధతుల ద్వారా భూమిలోకి ఎలా ఇంకింపజేయాలి, అలాగే కురిసిన ప్రతి వర్షపు నీటి బొట్టును సద్వినియోగం చేసుకునేలా ఎలాంటి ప్రణాళికలు రూపొందించుకోవాలనే ప్రధానాంశాలపై సభలో సుదీర్ఘంగా చర్చించారు. నీటి సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ తర్వాత సభకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు మరియు గ్రామ ప్రజలందరూ కలిసి 'జలమే జీవనాధారం ప్రతి నీటి బొట్టును కాపాడుకుందాం' అంటూ ఎంతో నిబద్ధతతో ఏకగ్రీవంగా ప్రతిజ్ఞ చేశారు.ఈ విస్తృతత స్థాయి గ్రామసభ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి పవార్ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ అధికారి క్షేత్ర సహాయకుడు లతో పాటు స్థానిక రైతులు, గ్రామ ప్రముఖులు, మహిళలు మరియు దేగాం గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ జల సంరక్షణ సభను విజయవంతం చేశారు.






## విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల సహకారం కీలకం

**నాగారం, జూలై 18(ప్రజా క్షేత్రం):**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పి.సి. రాములు సమావేశానికి అధ్యక్షత వహించి విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, ప్రవర్తన, హాజరు తదితర అంశాలపై తల్లిదండ్రులతో చర్చించారు. గత రెండేళ్లుగా కీసర మండలంలో పదో తరగతి ఫలితాల్లో పాఠశాల ప్రథమ స్థానంలో నిలుస్తోందని, అదే విజయ పరంపరను కొనసాగించేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని తల్లిదండ్రులు అభినందిస్తూ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరవింద్ కుమార్, మాలోత్ నాయక్, ఎ. సంధ్యారాణి, వందన, అజీజ్ అహ్మద్, రఘు, సుమతి, అర్చన, సంజయ్ రాణి, కౌసల్య, పద్మా, పాండురంగారెడ్డి, సరిత, కమల, రమా సత్యశ్రీ, గాయత్రీ సుప్రజతో పాటు విద్యా వాలంటీర్లు స్వప్న, అల్కా, పావని, పవిత్ర, విశాలి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ కేబీఆర్ పార్కులో భారీ కొండచిలువ...

- **కేబీఆర్ పార్క్‌లో 20 అడుగుల కొండచిలువ ప్రత్యక్షం**
- **వాకింగ్ ట్రాక్ దాటుతుండగా చూసి ఆశ్చర్యపోయిన వాకర్లు**
- **సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన కొండచిలువ వీడియో**



**హైదరాబాద్ జులై 18(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్‌లో శనివారం ఉదయం ఓ భారీ కొండచిలువ ప్రత్యక్షమవ్వడం కలకలం రేపింది. సుమారు 20 అడుగుల పొడవున్న ఈ 'ఇండియన్ రాక్ పైథన్' పార్క్‌లోని వాకింగ్ ట్రాక్‌ను నెమ్మదిగా దాటుతుండగా చూసిన మార్నింగ్ వాకర్లు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కొందరు ఈ దృశ్యాన్ని తమ ఫోన్లలో చిత్రీకరించగా, ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఈ ఘటనతో వాకర్లు కొద్దిసేపు నిలిచిపోయి, సురక్షిత దూరం నుంచి ఆ కొండచిలువను గమనించారు. అయితే, ఎవరికీ ఎటువంటి హాని తలపెట్టకుండా అది నెమ్మదిగా సమీపంలోని పొదల్లోకి వెళ్లిపోయింది. కాగా, వన్య ప్రాణి సంరక్షణ చట్టం 1972లోని షెడ్యూల్ 1 ప్రకారం 'ఇండియన్ రాక్ పైథన్' అత్యంత రక్షిత జాతుల జాబితాలో ఉంది. ఇటీవల హైదరాబాద్ నగరంలో పాముల సంచారం గణనీయంగా పెరిగిందని, వాతావరణ మార్పుల కారణంగానే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్' వంటి స్వచ్ఛంద సంస్థలు పేర్కొంటున్నాయి. వన్య ప్రాణులు ఎక్కడైనా కనిపిస్తే వాటికి దూరంగా ఉండాలని, వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

## జుంటిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నుంచి ఘనంగా గిరి ప్రదర్శన

- **సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని భక్తుల ప్రార్థనలు**
- **శ్రీరామ నామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో సాగిన పాదయాత్ర**



**యాలాల జూలై 18(ప్రజాక్షేత్రం):**

యాలాల మండలంలోని జుంటుపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ సభ్యులు రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో శనివారం భక్తుల నడుమ గిరి ప్రదర్శన వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు వదిరాజ్ వేద మంత్రోచ్చారణల మధ్య ప్రారంభించగా జైశ్రీరామ్ శ్రీరామ జయ రామ జయ రామ నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. వేకియోజామున దేవస్థానం నుంచి బయలుదేరి పాదయాత్రలో భజన మండలి భక్తులు, మహిళలు, యువకులు, చిన్నారులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గిరి ప్రదర్శన అక్కంపల్లి, చెన్నారం, దౌలాపూర్, తిమ్మాయిపల్లి, బండమీదిపల్లి, గ్రామాల మీదుగా భక్తిశ్రద్ధలతో కొనసాగింది. మార్గమధ్యంలోని ప్రతి గ్రామంలో భక్తులకు ఘన స్వాగతం లభించింది. ఆయా గ్రామాల శ్రీరామ, ఆంజనేయ స్వామి దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలు భక్తులు సాధనంగా ఆహ్వానిస్తూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించి యువతలో భక్తి భావాన్ని పెంపొందించాలని సూచించారు. చెన్నారం గేటు వద్ద అనిల్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం దౌలాపూర్ లోని శుభం పత్తి మిల్లు యాజమాన్యం డోలాపూర్ సర్పంచ్ విజయనిర్మల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పండ్లు, ఫలహారాలు పంపిణీ చేసి భక్తులకు సేవలు అందించారు. గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సంతోషంగా జీవించాలని శ్రీ సీతారామచంద్రస్వామిని ప్రార్థించారు. ప్రదర్శన అనంతరం దేవాలయ ప్రాంగణంలో అక్కంపల్లి గ్రామానికి చెందిన వెంకట్ రాములు ఫైనాన్స్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమం లో వివిధ గ్రామాల భక్తులు, గ్రామ పెద్దలు, సర్పంచులు, మహిళలు, యువకులు, చిన్నారులు, భజన మండలి భక్తులు విశేషంగా పాల్గొని గిరి ప్రదర్శనను విజయవంతం చేశారు. భక్తి, ఆధ్యాత్మికత, సామాజిక సేవల సమ్మేళనంగా సాగిన ఈ కార్యక్రమం స్థానికంగా విశేష ఆదరణ పొందింది. శ్రీరామ నామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ సభ్యులు అక్కంపల్లి సర్పంచ్ ర్యాల పేట లక్ష్మీ రాములు, చెన్నారం సర్పంచ్ నవీన పవన్ రెడ్డి, దౌలాపూర్ సర్పంచ్ విజయనిర్మల శ్రీనివాస్, తిమ్మాయిపల్లి సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి, బండమీదిపల్లి సర్పంచ్ నరేష్, చెన్నారం మాజీ సర్పంచ్ ఆకుల శివకుమార్, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ వడ్డే రాములు, నాయకులు శరణు భూపాల్, అయ్యగాళ్ళ భీమయ్య, అక్కంపల్లి భజన మండలి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## చెరువు అందంగా..ప్రజల జీవితం భద్రంగా ఉండాలి.

- **అభివృద్ధి ఒక్కటే కాదు..జీవన హక్కులూ కాపాడాలన్న కొలన్**

**కుత్బుల్లాపూర్, జూలై 18 (ప్రజాక్షేత్రం)**

నిజాంపేట్ తుర్క చెరువు అభివృద్ధి పనులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పరిశీలించారు. చెరువు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి, స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువుల అభివృద్ధి పర్యావరణ పరిరక్షణకు ఎంత అవసరమో, దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాల జీవన హక్కులను కాపాడటం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో నిరుపేదలను ఇబ్బందులకు గురిచేయకుండా, మానవతా దృక్పథంతో పునరావాసం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి అనే మూడు అంశాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వరగాని వాసు, తాటి రెడ్డి, మురళి, మౌళేశ్వర్ రావు, రఫియా బేగం, చిట్ల దివాకర్, వీరేష్, ఇందిర



కడియాల, నాగరాజ్, సాయి, బాల బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలి

- **కోర్టు డ్యూటీ అధికారులకు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశం**
- **పెండింగ్ నాన్‌బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి**

**వనపర్తి, జూలై 18(ప్రజాక్షేత్రం):**

కోర్టు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా పనిచేయాలని, ప్రతి కేసులో చట్టపరమైన ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి కోర్టు డ్యూటీ అధికారులను ఆదేశించారు.

శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు లైజన్ అధికారులు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కోర్టు విధులను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారమవుతాయని ఎస్పీ పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి కేసు తుది తీర్పు వచ్చే వరకు అవసరమైన ఆధారాలు, పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలను సకాలంలో కోర్టుకు సమర్పించడంలో కోర్టు డ్యూటీ అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు. సాక్షులు, బాధితులను నిర్ణీత తేదీల్లో కోర్టుకు హాజరుపరిచే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు.

**కేసుల పురోగతిపై సమీక్ష**

పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమావేశంలో ఎస్పీ సమీక్షించారు. సంబంధిత కేసుల్లో ఎదురవుతున్న సమస్యలను కోర్టు డ్యూటీ అధికారులను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. కోర్టు విచారణలకు సంబంధించిన సమాచారం, ప్రాసిక్యూషన్ అంశాలను ఎప్పటికప్పుడు సంబంధిత ఎస్ఐలకు చేరవేయాలని ఆదేశించారు.

**ఎన్‌బీడబ్ల్యూలు త్వరగా అమలు చేయాలి**

పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూలు), సమన్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. నిందితులను త్వరితగతిన కోర్టు ముందు హాజరుపరిచి పెండింగ్ వారెంట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెరగడం ద్వారా ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం మరింత బలపడుతుందని ఆమె పేర్కొన్నారు.

సమావేశంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్, డీసీఆర్‌బీ ఎస్ఐ తిరుపతి రెడ్డి, జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.






## డ్రోన్‌తో వ్యవసాయంలో కొత్త ఒరవడి సృష్టించిన సోంపల్లి ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి

- **ఆధునిక సాంకేతికతతో అధిక దిగుబడులు – ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచిన ప్రగతిశీల రైతు**

**బూర్గంపాడు జూలై 18(ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామానికి చెందిన ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి ఆధునిక వ్యవసాయంలో తనదైన ముద్ర వేస్తూ జిల్లా రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.సాంప్రదాయ వ్యవసాయానికి భిన్నంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగుతున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోత్సాహం,వ్యవసాయ శాఖ సహకారంతో రబీ పంట సాగులో డ్రోన్ ద్వారా విత్తనాలు వెదజల్లిన తొలి రైతుగా బూర్గంపాడు మండలంలో గాదె నర్సిరెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారు.డ్రోన్ సాంకేతికతను విజయవంతంగా వినియోగించి ఇతర రైతులు కూడా ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేయడానికి ప్రేరణగా నిలిచారు.అప్పటి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని, పామాయిల్, మునగ వంటి అధిక ఆదాయం ఇచ్చే పంటలతో పాటు అనుబంధ వ్యవసాయ రంగాలపై దృష్టి పెట్టాలని సూచించిన నేపథ్యంలో గాదె నర్సిరెడ్డి ఆ సూచనలను ఆచరణలో పెట్టి ఆదర్శ రైతుగా నిలిచారు.కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ టి. భరత్ మాట్లాడుతూ, గాదె నర్సిరెడ్డి వంటి ప్రగతిశీల రైతులు వ్యవసాయంలో సాంకేతిక విప్లవానికి మార్గదర్శకులని ప్రశంసించారు. డ్రోన్ ద్వారా విత్తనాల వెదజల్లడం, ఎరువులు, సూక్ష్మపోషకాలు, పురుగుమందుల పిచికారీ వంటి పనులు వేగంగా, తక్కువ వ్యయంతో నిర్వహించవచ్చని తెలిపారు.వ్యవసాయ శాఖ ఏడీఏ తాతారావు మాట్లాడుతూ, గాదె నర్సిరెడ్డి సాధించిన ఫలితాలు చూసి మరింత మంది రైతులు సాంకేతిక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మంజూరు చేసిన వ్యవసాయ డ్రోన్లను రైతులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి మాట్లాడుతూ, కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ అందిస్తున్న సాంకేతిక సూచనలను పాటిస్తూ ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తున్నానని తెలిపారు.డ్రోన్ వినియోగంతో కూలీల కొరత సమస్య తగ్గడమే కాకుండా సాగు వ్యయం తగ్గి, అధిక దిగుబడులు సాధించి మెరుగైన లాభాలు పొందుతున్నానని చెప్పారు. రైతులు కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని ఆయన సూచించారు.వ్యవసాయంలో సాంకేతికతను ఆచరణలో చూపిస్తూ, ప్రగతిశీల రైతుగా గాదె నర్సిరెడ్డి నిలుస్తుండటం బూర్గంపాడు మండల రైతులకు స్ఫూర్తిదాయకంగా మారింది.

## 19 ఏళ్లుగా న్యాయం కోసం పోరాటం

- **ఢిల్లీకి చేరిన 60 గజాల ఇళ్ల స్థలాల సమస్య**



**మొయినాబాద్, జూలై 18(ప్రజా-క్షేత్రం):**

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్నగర్ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 151లో 60 గజాల ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న 290 మంది పేద కుటుంబాల సమస్య ఢిల్లీ ప్రధానమంత్రి కార్యాలయానికి చేరింది. తెలంగాణ టీడీపీ నాయకులు షాబాద్ మాణిక్యం గురువారం ఢిల్లీలోని పీఎంఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన పేదలకు 60 గజాల ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసినప్పటికీ, ఇప్పటివరకు స్థలాలు అందుబాటులోకి రాకపోవడంతో బాధితులు గత 22 రోజులుగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ సమస్యపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించి, పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా షాబాద్ మాణిక్యం మాట్లాడుతూ, 19 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం పేదలు ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వాలు మారినా వారి సమస్య మాత్రం పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బాధితులు నిరసన కొనసాగిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. హిమాయత్ నగర్ బాధితులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వా న్ని ఆయన డిమాండ్ చేశారు.

## పెన్నార్ లో బి ఆర్ టి యు జెండా ఆవిష్కరణ

**సంగారెడ్డి జులై 18(ప్రజాక్షే-త్రం):**



సదాశివపేట మండలం చందాపూర్ లోని పెన్నార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీలో బి ఆర్ టి యు జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అధ్యక్షులు రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి విచ్చేసి జెండావిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై కలిసికట్టుగా పోరాడటం జరుగుతుందన్నారు. ఈ జెండా ఆవిష్కరణలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. పెన్నార్ ఇండస్ట్రీస్ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ వీరన్న, రమేష్, ప్రసాద్, బాబు, రవీంద్ర, దుర్గాప్రసాద్, లక్ష్మణ్, పుట్టరాజు, శ్రీశైలం, అనిల్, భాగయ్య, సంతోష్ కుమార్, అనిల్, వెంకటేశం, సురేష్, కార్మికులు అధిక సంఖ్యలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొన్నారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394